మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

7.2.2026 శనివారం Saturday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 289 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar



# అండర్ 19 ప్రపంచకప్ ఛాంపియన్ భారత్



ఫైనల్లో భారత్ చేతిలో ఇంగ్లండ్ చిత్తు!

100 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా

411 పరుగులతో భారత జట్టు ఆల్‌టైమ్ రికార్డు

7

అండర్-19 క్రికెట్‌లో భారత యువ జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. హరారే వేదికగా జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా రికార్డుస్థాయిలో ఆరోసారి అండర్-19 ప్రపంచకప్‌ను ముద్దాడి చరిత్ర సృష్టించింది. తొలుత బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించి, ఆపై బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసింది.



## రేవంత్‌రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి

కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు

.. వివరాలు 3లో



## సిగాచీ మృతుల కుటుంబాలకు మోసం

కోటి ఇస్తానని చెప్పి..
రూపాయి కూడా ఇవ్వలేదు

ఇచ్చినట్లు రుజువు చేస్తే
ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తా

సీఎంకు హరీష్ రావు సవాల్

.. వివరాలు 3లో




# బీఆర్ఎస్, బీజేపీది ఫెవికాల్ బంధం

## కేసీఆర్‌కు దత్తపుత్రుడిగా మారిన కిషన్‌రెడ్డి



అందుకే కేసీఆర్, కేటీఆర్‌ను కాపడుతున్నాడు

కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఆదేశించినా పట్టించుకోని కేంద్రం

అర్వింద్‌తో జిల్లాకు ఒరిగింది శూన్యం

బిజెపి, బీఆర్ఎస్‌లను నమ్ముకుంటే నట్టేట ముంచుతారు

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం

రైతుల పోరాటం ఆదర్శం

నిజామాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

మాజీ సీఎం కేసీఆర్‌కు ఇద్దరు పుత్రులు ఉన్నారని, ఒకరు దొంగ పుత్రుడు కేటీఆర్ అని, మరొకరు దత్తపుత్రుడు కిషన్‌రెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు జైలుకు వెళ్లకుండా ఆయనే కాపాడుతున్నారని ఆరోపించారు.

**జనతా న్యూస్, నిజామాబాద్ :** నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని వ్యవసాయం తెలంగాణకే కాదు, దేశానికే ఆదర్శమన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్‌లో

మిగతా 2 లో

# మీ చేతిలోనే దేశ భవిష్యత్తు

## సవాళ్లను అవకాశాలుగా మలచాలి



మీరంతా ఎగ్జామ్ వారియర్స్

ఒత్తిడిని నియంత్రించాలి

సొంతశైలిని ఏర్పరుచుకోవాలి

అదేపనిగా ఆన్లైన్ గేమ్లు ఆడొద్దు

మార్కుల కన్నా మైండ్ సెట్ ముఖ్యం

పరీక్షా పే చర్చ కార్యక్రమంలో విద్యార్థులతో ప్రధాని మోడీ

వివరాలు 4 లో..

అదేపనిగా ఆన్లైన్ గేమ్లు ఆడవద్దని విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోడీ సూచించారు. శుక్రవారం పరీక్షా పే చర్చ-2026 కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తం గా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లతో సంభాషించారు.

# ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ విచారణ

పిటిషన్లపై తాజాగా సుప్రీం మరోమారు విచారణ

మూడు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం



తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణను సుప్రీంకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది. న్యాయస్థానంలో తాజాగా జరిగిన విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి.

3

# మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం

## పన్నుల్లో ప్రజలకు వెసలుబాటు కల్పిస్తాం



అప్పట్లో రేవంత్‌ను కేసీఆర్ కాపాడితే..

ఇప్పుడు కేసీఆర్‌ను రేవంత్ కాపాడుతున్నారు!

బీఆర్ఎస్‌తో స్నేహం లేకపోతే కాళేశ్వరం అవినీతిపైనే సీబీఐ విచారణను కోరాలి

జిల్లాల వారీగా కేటాయించిన నిధులు చెప్పగలరా?: రాంచందర్‌రావు

మునిసిపోల్‌పై బీజేపీ మేనిఫెస్టో విడుదల

రాష్ట్రాన్ని దోచుకోవడంలో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పోటీ: కిషన్‌రెడ్డి

# హైదరాబాద్ నగర అభివృద్ధికి రెండేళ్లలో 20వేల కోట్లు

మహానగరం ప్రపంచంలో మేటి నగరాలతో పోటీ పడుతుంది

27 మునిసిపాలిటీల విలీనం చారిత్రాత్మక నిర్ణయం

ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షో లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



2

## వైభవంగా గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్

న భూతో న భవిష్యత్తు అన్నట్టు నిర్వహిస్తాం

గద్దర్ ఆలోచనలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుంది

ప్రపంచ ఫిల్మ్ ఇండస్ట్రీ హబ్ గా హైదరాబాద్

సినిమా స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన భట్టి



# ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

సుమారు 25మంది దుర్మరణం

.. వివరాలు 4లో



# ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ విచారణ

## పిటిషన్లపై తాజాగా సుప్రీం మరోమారు విచారణ

## మూడు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి6 :** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణను సుప్రీంకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది. న్యాయస్థానంలో తాజాగా జరిగిన విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం.. బీఆర్ఎస్, బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద విచారణ ప్రస్తుతం కొనసాగుతోందని కోర్టుకు స్పష్టం చేశారు. ఈ పక్రియ పూర్తి చేయడానికి మరో మూడు వారాల సమయం కావాలని ఆయన కోరారు. అసెంబ్లీ స్పీకర్‌కు ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని గతంలోనే గుర్తు చేసిన ధర్మాసనం, ఈసారి స్పీకర్ నిర్ణయం పాజిటివ్‌గా ఉండాలని స్పష్టం చేసింది. సింఘ్వీ విన్నపాన్ని మన్నిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఆ సమయానికి స్పీకర్ తీసుకున్న నిర్ణయాల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన దాఖలు చేసిన ఈ ధిక్కరణ పిటిషన్‌ను కూడా ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మూడు వారాల గడువులోగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. కోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# వైభవంగా గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్

## సినిమా స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన భట్టి



**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** వచ్చే ఉగాది రోజున గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని న భూతో న భవిష్యత్తు అన్న విధంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించాలని ప్రపంచ ఫిలిం ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ వైపు తిరిగి చూసేలా ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రసాద్ లాబ్స్ లో గద్దర్ ఫిలిం అవార్డుల సందర్భంగా సినిమాల స్క్రీనింగ్ పక్రియ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మార్పు కోసం కలలను ఉపయోగించి, ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని ఆయన సేవలను డిప్యూటీ సీఎం కొనియాడారు. అందుకే ప్రజా ప్రభుత్వం ఆయన పేరిట సినిమా అవార్డులను ప్రారంభించింది ఇది రెండవ సంవత్సరం అని వివరించారు. వచ్చే ఉగాది పర్వదినం రోజు ఘనంగా గద్దర్ ఫిలిం అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ద్దర్ చివరి రోజుల్లో వారితో తాను ఎక్కువ కాలం గడిపానని, వారి స్టూడియోలో అనేక ప్రయోగాత్మక పాటలు పాడారని, చివరి రోజుల్లో గద్దర్ రికార్డింగ్ స్టూడియోలో ఎక్కువ రోజులు గడిపారని డిప్యూటీ సీఎం గుర్తు చేసుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు అవార్డులను ఇవ్వబోతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కేవలం తెలుగు ఇండస్ట్రీక్రే కాదు భారతదేశంలోని వివిధ భాషలకు హైదరాబాద్ కేంద్రంగా మారాలని ప్రజా ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉండే వాతావరణ పరిస్థితులు, నిపుణులు, శాంతి భద్రతలు దేశంలోని మరే ఇతర నగరాల్లో లేవని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉన్న సానుకూల వాతావరణాన్ని ఉపయోగించుకొని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బ్లూ ప్రింట్ తయారు చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు. సినిమాల ద్వారా సామాజిక సందేశం ఇవ్వడంతో పాటు ఆర్థిక వనరులు సమకూరే అవకాశం ఉంటుందని తెలిపారు.్గ ÷లుగు సినిమా ఇండస్ట్రీ ఆస్కార్ వంటి ప్రపంచ స్థాయి అవార్డులను సాధించడం గర్వించదగిన అంశం అటువంటి అంశాలను పునాదిగా చేసుకుని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చాలని ఆలోచనల తో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. సినిమా పరిశ్రమకు అవసరమైన ఆర్థిక, సామాజిక, శాంతిభద్రతలపరంగా ఇంకా ఎటువంటి అవసరం అయినా అర్ధరాత్రి తమ ప్రజా ప్రభుత్వం తలుపు తట్టవచ్చని మీకోసం సీఎం రేవంత్ రెడ్డి సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోపాటు తాను అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు, శాఖ మంత్రి వెంకట్ రెడ్డి గారు అందుబాటులో లేరు మీ అందరిని ప్రోత్సహించాలనేది మా అందరి ఏకైక లక్ష్యం అనే సందేశాన్ని మీ అందరికీ తెలియజేయవలసిందిగా తనకు తెలిపారని డిప్యూటీ సీఎం వివరించారు. గద్దర్ ఫిలిం అవార్డుల కార్యక్రమాన్ని ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మనస్ఫూర్తిగా తీసుకొని బాధ్యతాయుతంగా ముందుకు వెళ్తున్నారని డిప్యూటీ సీఎం అభినందించారు. సినీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం, సినీ కార్మికుల కోసం, సినీ రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేయాలని ఆలోచనలను సైతం దిల్ రాజు తమతో పంచుకుంటున్నారని డిప్యూటీ సీఎం వివరించారు. జూరీ చైర్మన్ మణిశర్మ తెలియని వారు సినీ రంగంలో లేరని, తరతమ బేధాలు లేకుండా, పారదర్శకంగా సినిమాలు చూడడమే కాదు నిష్పక్షపాతంగా అవార్డుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టాలనీ చైర్మన్ తో పాటు జూరీ సభ్యులను కోరుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్డిసి చైర్మన్ దిల్ రాజు, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మణిశర్మ, ఎఫ్డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీది ఫెవికాల్ బంధం

మొదటి పేజీ తరువాయి



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సూచనలతో ఈ జిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నాం. మన వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నేను అందరివాడిని. నాకు కులం, మతం లేదు. ఈ జిల్లా గొప్ప నాయకులను అందించింది. మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందని మండిపడ్డారు. ధర్మపురి అర్వింద్‌ను ఎంపీగా రెండుసార్లు గెలిపించినా.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. మోదీ మూడు సార్లు ప్రధానమంత్రి అయినా.. నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదు. మోదీ దగ్గర ఎంపీ అర్వింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టులో అవినీతి జరిగిందని భాజపా చెప్పింది. ఆ కేసును సీబీఐకి అప్పగించాం ఏమైంది? కేసీఆర్, కేటీఆర్‌ను ఎప్పుడు అరెస్టు చేస్తారని భాజపాని అడుగుతున్నానని మరోమారు ప్రశ్నించారు. కెసీఆర్, కేటీఆర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని సీఎం విమర్శించారు. దత్తపుత్రుడు కిషన్ రెడ్డి, దొంగ పుత్రుడు కేటీఆర్ కలిసి కేసీఆర్ ను కాపాడుతున్నారుని ఆరోపించారు. కాళేశ్వరం కేసు సీబీఐ కి ఇస్తే 48 గంటల్లో కేసీఆర్ ను జైల్లో పెడతా మన్న కిషన్ రెడ్డి.. కాళేశ్వరం కేసును బీజేపీ ఎందుకు ముందుకు సాగనీయడం లేదు.. సీబీఐ విచారణ చేయాలని కోరినా ఇప్పుడు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే ..నిజామాబాద్ జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్ లను గెలిపిస్తే అభివృద్ధి జరగదని అన్నారు. బీజేపీనుంచి ఇద్దరు కేంద్ర మంత్రులన్నా.. నిధులు తెచ్చింది నిల్ అన్నారు. జిల్లా అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెలవాలంటే కాంగ్రెస్ ను గెలిపించుకోవాలన్నారు. అభివృద్దే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశాం.. ఒక కార్పొరేషన్, ఏడు మున్సిపాలిటీలలోవెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు సీఎం రేంత్ రెడ్డి.రూ.600కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌నిర్మిస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి 100 శాతం సహకరిస్తా..నిధులిచ్చే బాధ్యత నాది.. నిజామాబాద్ ను అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్,సలహాదారు సుదర్శన్ రెడ్డి, మంత్రులు,ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌పై ఎన్నికల పిటిషన్

## రేవంత్ అభ్యర్థనకు హైకోర్టు తిరస్కరణ

**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. 2023లో భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు కాగా, వాటిని రద్దు చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్న న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

# కాంగ్రెస్ 75 శాతానికి పైగా స్థానాలు గెలుస్తుంది

## ప్రచారంలో మంత్రి దామోదర రాజనర్సింహ

**రంగారెడ్డి,ఫిబ్రవరి6 :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న క్రమంలో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి ప్రధాన పార్టీలు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 75 శాతానికి పైగా స్థానాలు గెలుస్తుందని అన్నారు. ప్రచారంలో అమ్మా.. బాగున్నారా.. మా పాలన ఎలా ఉంది.. పథకాలు అందుతున్నాయా.. మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది.. అంటూ... ఓటర్లను మంత్రి దామోదర రాజనర్సింహ పలకరించారు. 14వ వార్డు అభ్యర్థి అందెమోహన్ తరపున ఇంటింటి ప్రచారానికి వచ్చిన ఆయన స్థానిక భవాని మాత ఆలయం దగ్గర రచ్చబండ ఏర్పాటు చేసి మహిళలతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పలువీధుల్లో తిరిగి కాంగ్రెస్ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. తమ అభ్యర్థి అందెమోహన్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు దామోదర రాజనర్సింహ. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో 75శాతానికి పైగా గెలుస్తుందని అన్నారు.

# హైదరాబాద్ నగర అభివృద్ధికి రెండేళ్లలో 20వేల కోట్లు

## మహానగరం ప్రపంచంలో మేటి నగరాలతో పోటీ పడుతుంది

## 27 మునిసిపాలిటీల విలీనం చారిత్రాత్మక నిర్ణయం

## ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షో లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్, ఫిబ్రవరి 6 :** హైదరాబాదు నగరాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాల వ్యవధిలోనే 20వేల కోట్లు కేటాయించాం, ఇందులో అనేక పనులు పూర్తికాగా మరికొన్ని పనులు ప్రగతిలో ఉన్నాయని, ఈ తరహాలో హైదరాబాదు నగర అభివృద్ధికి నిధులు కేటాయించడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదని డిప్యూటీ సీఎం తెలిపారు. శుక్రవారం హైటెక్స్ లో క్రెడాయ్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షో సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిహెచ్ఎంసి పరిధిలో 1950.52 కోట్లు, మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలో 12,500 కోట్లు, నగర పరిధిలో 4,3365 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. హైదరాబాదు నగరం పెట్టుబడులు, ప్రతిభ, జీవన ప్రమాణాల్లో నాణ్యత విషయంలో దేశంలోని నగరాలతోనే మాత్రమే కాదు ప్రపంచంలోని అగ్ర నగరాలతో హైదరాబాద్ మహానగరం పోటీ పడుతుందని డిప్యూటీ సీఎం వివరించారు. హైదరాబాద్ మహానగరం చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయడం ఓ చారిత్రాత్మక నిర్ణయమని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. ఈ గొప్ప నిర్ణయం ద్వారా నగరంలోని పౌరులకు ఒకే విధమైన పౌర సేవలు, సమగ్ర ప్రణాళిక, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఒకే అభివృద్ధి దృక్పథం సాధ్యం అయ్యాయి అన్నారు. ఈ రోజు హైదరాబాద్ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, పెట్టుబడులకు అనుకూలమైన నగరాలలో ఒకటిగా నిలుస్తోంది. ఇది యాదృచ్ఛికంగా జరిగినది కాదు. దశాబ్దాల పాటు సాగిన సంస్థాగత నిర్మాణం, ప్రజాస్వామ్య పాలన, మరియు సమగ్ర అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం నిబద్ధత ఫలితమే ఇది అన్నారు. ఈ రోజు మన అభివృద్ధి గతంలోని దూరదృష్టి గల నాయకత్వం వేసిన బలమైన పునాదులపై నిలబడి ఉంది, ప్రస్తుత ప్రభుత్వం పారదర్శకత, బాధ్యతాయుత పాలన, ప్రజాకేంద్రిత పాలనపై పెట్టిన దృష్టి ఈ పునాదులను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. నగరాభివృద్ధి అనేది న్యాయమైనది, సమతుల్యమైనది, అందరికీ అందుబాటులో ఉండాలనే మా నమ్మకాన్ని మున్సిపాలిటీల విలీనం ప్రతిబింబిస్తుంది అన్నారు. రజలు ఎక్కడ నివసిస్తున్నారనే అంశంతో సంబంధం లేకుండా ఈ రోజు హైదరాబాద్‌ను విడివిడిగా ఉన్న సంపన్న ప్రాంతాల సమాహారంగా కాదు, ఒకటిగా అనుసంధానమైన, సమగ్రంగా అభివృద్ధి చెందుతున్న మహానగరంగా తీర్చిదిద్దుతున్నాం అని వివరించారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రోగ్రాం కింద, 7,032 కోట్లకు పైగా పెట్టుబడితో 45 ప్రధాన ఫ్లై ఓవర్లు, అండర్‌పాసులు మరియు 10 రోడ్డు విస్తరణ ప్రాజెక్టులను అమలు చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం వివరించారు. అభివృద్ధి నగరమంతటా సమతుల్యంగా సాగుతోంది అన్నారు. హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ పరిసరాల్లోని ప్రాజెక్టులు ట్రాఫిక్ రద్దీని రూ. 1090 కోట్లు వెచ్చించి నియంత్రణ పనులు చేపడుతున్నామని తెలిపారు. పడమటి కారిడార్‌లో ఎఎ÷ు మరియు ఖాజాగూడ వద్ద రూ. 837 కోట్లతో మల్టీలెవల్్గ ÷÷-లఓల్గ÷వర్లు నాలెడ్జ్ ఎకానమీకి తోడ్పడుతున్నాయి, మరో 70 కోట్లతో వెస్ట్రన్ సిటీలో ప్రధాన రోడ్ల విస్తరణ పనులు జరుగు తున్నాయని తెలిపారు. ఉత్తర భాగంలో ఆర్మీ ఆర్డినెన్స్ సెంటర్ సమీపంలోని ప్రత్యామ్నాయ రహదారి నెట్‌వర్క్‌లు ఏళ్లనాటి ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు రూ. 960 కోట్లతో పనులు చేపట్టినట్టు వివరించారు. తూర్పు హైదరాబాద్‌లో టీకేఆర్ కాలేజ్, గాయత్రి నగర్, మండమల్లమ్మ జంక్షన్ వద్ద ÷÷-లఓల్గ÷వర్లు కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు రూ 416 కోట్లతో పనులు చేపట్టినట్టు తెలిపారు. దక్షిణ భాగంలో, వేగంగా విస్తరిస్తున్న పట్టణాభివృద్ధికి రోడ్డు విస్తరణ ప్రాజెక్టులను రూ .863 కోట్లతో చేపట్టినట్టు వివరించారు. ఇది నగరమంతటా జరుగుతున్న సమిష్టి ప్రయత్నం. ఏ ప్రాంతాన్నీ నిర్లక్ష్యం చేయడం లేదు. ఏ సముదాయాన్నీ మరిచిపోవడం లేదు అని తెలిపారు. ఈ పెట్టుబడులు ప్రయాణ సమయాన్ని తగ్గిస్తున్నాయి, లాజిస్టిక్స్‌ను మెరుగుపరుస్తున్నాయి, ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేస్తున్నాయి, భూవిలువలను పెంచుతున్నాయి. అంతకన్నా ముఖ్యంగా విద్యార్థులు, కార్మికులు, వ్యాపారవేత్తలు, కుటుంబాలు వంటి సాధారణ ప్రజల రోజువారీ జీవితాన్ని మెరుగుపరుస్తున్నాయి అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 కింద, రాష్ట్ర అభివృద్ధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమిని కేంద్రంగా ఉంచుతోందనీ తెలిపారు. ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో పాటు సాగాలన్న ప్రజా ప్రభుత్వం దీర్ఘకాలిక విశ్వాసానికి ఇది ప్రతిబింబం అన్నారు. హైదరాబాద్ తెలంగాణకు ఉపాధి, ఆవిష్కరణలు, గ్లోబల్ పెట్టుబడుల ప్రధాన ఇంజిన్‌గా కొనసాగుతుంది, అదే సమయంలో అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా చూస్తుంది అని భరోసా ఇచ్చారు. అందుకే 2047 వరకు దృష్టిలో ఉంచుకుని, వరదల భద్రత, వాతావరణ అనుకూలత కోసం ప్రత్యేకంగా లోతట్టు, వెనుకబడిన ప్రాంతాలకు ఉపయోగపడేల సమగ్ర స్టార్మ్ వాటర్ మాస్టర్ ఎ÷-లాన్‌ను సిద్ధం చేస్తున్నాం అన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలు, సంస్థాగత బలోపేతం, స్థిరమైన అభివృద్ధిపై మా ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయి అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్ ఇతర భారతీయ నగరాలతో మాత్రమే కాదు పెట్టుబడులు, ప్రతిభ, జీవన నాణ్యత కోసం ప్రపంచంలోని అగ్ర నగరాలతో పోటీపడుతోంది అన్నారు. పోటీలో విజయం సాధించాలంటే మూలధనం, సాంకేతికతతో పాటు ప్రజాసంస్థలపై నమ్మకం, సామాజిక సౌహార్దం, రాజకీయ స్థిరత్వం కూడా అవసరం, అదంతా అందించడానికి మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దేశంలోనే అత్యంత నివసించదగిన, పెట్టుబడులకు అనుకూలమైన, మంచి పాలనతో కూడిన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల మార్గనిర్దేశరలో కలిసి హైదరాబాద్‌ను నిజంగా ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుదాం అని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సదాసిద్ధంగా ఉంది,

మున్సిపాలిటీ ఎన్నికల బిజీ ఉన్నప్పటికీ తనతో పాటు సీనియర్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సైతం ఈ సమావేశానికి హాజరు అయ్యాము అంటే ఈ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి ఎలాంటిదో స్పష్టం అవుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# రేవంత్‌రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి

## కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు



**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల వేళ తమ ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్‌పై, ఆయన వ్యక్తిత్వం మీద రేవంత్ రెడ్డి విషం చిమ్ముతున్నాడని మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు.. తెలంగాణ పోరాట చరిత్ర మీద జరుగుతున్న దాడి అని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి అని తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది మన వార్డుల్లో మౌలిక వసతుల మీద, రోడ్ల మీద, డ్రైనేజీల మీద, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీద అని తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో, ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి మన స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడు కేసీఆర్. ఒక తండ్రిలా ఈ రాష్ట్రాన్ని అక్కున చేర్చుకుని, పడావు పడ్డ తెలంగాణను ప్రగతి బాటలో నడిపించిన మహోన్నత శిల్పి కేసీఆర్. కానీ, నేడు అధికారం చేతిలో ఉందనే అహంకారంతో, తన వైఫల్యాలను, తన ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ మీద, ఆయన వ్యక్తిత్వం మీద విషం చిమ్ముతున్నాడు. ఇది కేవలం ఒక వ్యక్తి మీద దాడి కాదు.. తెలంగాణ పోరాట చరిత్ర మీద జరుగుతున్న దాడి అన్నారు. రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పడకండి! మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది మన వార్డుల్లో మౌలిక వసతుల మీద, రోడ్ల మీద, డ్రైనేజీల మీద, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీద. కానీ రేవంత్ రెడ్డి తెలివిగా తన బూతు పురాణంతో అసలు చర్చను పక్కదోవ పట్టిస్తున్నాడు. ఈ విషపు వలలో మనం పడకూడదు. మన చర్చ, మన నిలదీత కేవలం ప్రజల కన్నీటి మీదనే ఉండాలి. ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాని ఆరు గ్యారంటీల గురించి నిలదీయండి. ఆ నమ్మకద్రోహం మీద యుద్ధంలా చర్చను మార్చండి అంటూ పిలుపునిచ్చారు. మన దృష్టిని ప్రజల సమస్యల మీదనే ఉంచుదాం.. మనకు ప్రాణసమానమైన తెలంగాణను ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుందాం అని కెటిఆర్ అన్నారు.

# సిగాచీ మృతుల కుటుంబాలకు మోసం

## కోటి ఇస్తానని చెప్పి..రూపాయి కూడా ఇవ్వలేదు

## ఇచ్చినట్లు రుజువు చేస్తే ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తా

## సిఎం రేవంత్‌కు హరీష్ రావు సవాల్



**సంగారెడ్డి,ఫిబ్రవరి6 :** సిగాచీ బాధిత కుటుంబాలకు కోటి ఇచ్చినట్లు రుజువు చూపితే తాను రాజకీయాల నుంచి వైదొలుగతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ విసిరారు. సంగారెడ్డి జిల్లాలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది మృతి చెందిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఆ బాధిత కుటుంబాలకు రేవంత్ రెడ్డి ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. 'సిగాచి ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా' అని ఛాలెంజ్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే తాను ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, మరుసటి రోజు మాత్రమే సీఎం వచ్చారన్నారు. కంపెనీ రూ.25 లక్షలు ఇచ్చినా.. రేవంత్ ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను గుర్తుచేస్తూ మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పెన్షన్‌ను 4 వేల రూపాయలకు పెంచుతామని బాండ్ పేపర్‌పై రాసిచ్చినా అమలు కాలేదన్నారు. కళ్యాణ లక్ష్మి కోసం కేసీఆర్ ఇచ్చిన లక్షా 116 రూపాయల కంటే రేవంత్ తులం బంగారం అదనంగా ఇస్తానని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఫ్రీ బస్సు పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని.. పురుషుల బస్సు ఛార్జీలను డబుల్ చేశారని విమర్శించారు. ఇస్నాపూర్‌లో గత రెండేళ్లలో గజం రోడ్డు కూడా వేయలేదని, చిన్న డ్రైనేజీ కూడా కట్టలేదన్నారు. కరోనా సమయంలో కేసీఆర్ ప్రజలను కాపాడారని హరీశ్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ లేని లోటు ఇప్పుడు అందరికీ తెలుస్తోందన్నారు. పనులు ఎవరు చేస్తారో గమనించి ఓటు వేయాలని హరీశ్ సూచించారు. బీజేపీని కార్మికులు, పేదల వ్యతిరేక పార్టీ అని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ సీఎం అన్న విషయాన్ని మర్చిపోయి ఏదేదో మాట్లాడుతున్నారని.. సీఎం మాట్లాడే భాష తగినది కాదన్నారు. కేసీఆర్‌ను బూతులు తిడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను జైలుకు పంపాలని చెబుతున్నారని విమర్శించారు. రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ సీఎంగా, తాను మంత్రిగా వస్తానన్నారు. అందరి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో డబ్బులు పంచితే తీసుకోవాలని.. ఓటు మాత్రం కారు గుర్తుకే వేయాలని ప్రజలను మాజీ మంత్రి హరీశ్ రావు కోరారు. ఓకాగా.. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీలో పర్యటించిన హరీశ్ రావు.. అక్కడి మహిళలతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. మహిళలతో ముచ్చటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# వాచ్‌మెన్‌కు మత్తుమందు ఇచ్చి చోరీ

## జూబ్లీహిల్స్‌లో ఘరానా దొంగతనం

**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఆ ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. రూ.20 లక్షలు విలువ చేసే బంగారం, డైమండ్స్ దోచుకెళ్లారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను పోలీసులు ఏర్పాటు చేశారు. నందగిరి హిల్స్ నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ వరకు సీసీ టీవీలను పరిశీలించారు. మొదటగా.. ఆ ఇంటి వద్ద సెక్యూరిటీగా ఉన్న వాచ్‌మన్‌కు మత్తుమందు కలిపి ఇచ్చారు. ఆ తర్వాత ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేశారు. వాచ్‌మన్ మత్తులోకి జారుకోగానే దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంటి లాకర్‌లోని బంగారు ఆభరణాలు మొత్తం ఎత్తుకెళ్లారు. ఈ చోరీ కేసులో నలుగురు నేపాలీలను ప్రధాన అనుమానితులుగా భావిస్తున్నారు పోలీసులు. బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. దొంగల కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దొంగలు నగరం విడిచి వెళ్లకుండా విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో ముమ్మర తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. గతంలోనూ ఈ తరహా నేరాలకు పాల్పడిన పాత నేరస్థుల జాబితాను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. నగరంలో నేపాలీ గ్యాంగ్‌ల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా పని మనుషులు, వాచ్‌మెన్‌లను నియమించే సమయంలో వారి ఆధార్ కార్డులు, పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని పోలీసులు సూచిస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం

## పన్నుల్లో ప్రజలకు వెసలుబాటు కల్పిస్తాం

## అప్పట్లో రేవంత్‌ను కేసీఆర్ కాపాడితే..

## ఇప్పుడు కేసీఆర్‌ను రేవంత్ కాపాడుతున్నారు!

## బీఆర్ఎస్‌తో స్నేహం లేకపోతే కాళేశ్వరం అవినీతిపైనే సీబీఐ విచారణను కోరాలి

## జిల్లాల వారీగా కేటాయించిన నిధులు చెప్పగలరా?: రాంచందర్‌రావు

## మునిసిపోల్‌పై బీజేపీ మేనిఫెస్టో విడుదల

## రాష్ట్రాన్ని దోచుకోవడంలో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పోటీ: కిషన్‌రెడ్డి



మేనిఫెస్టో విడుదల చేసిన బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. భాజపా విజయం సాధిస్తే పెండింగ్‌లో ఉన్న పన్నుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామన్నారు. అవినీతి రహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని.. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాలపై ఉక్కు పాదం మోపడంతో పాటు యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను అధికారికంగా విడుదల చేశారు. ప్రధాన అంశాల్లో కోతులు, కుక్కల బెడద నివారణను చేర్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జిలు అశోక్ పర్ణామి, రేఖాశర్మతో కలిసి వికసిత తెలంగాణ.. భాజపా సంకల్ప పత్రం పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు విడుదల చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భాజపాను చూసి భయపడుతున్నాయని అని రామచందర్ రావు అన్నారు. కేంద్రం.. తెలంగాణకు ఏం ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి ఏం ఇచ్చిందో.. జిల్లాల వారీగా చెబుతామని, రేవంత్ రెడ్డి జిల్లాలకు ఏం ఇచ్చారో చెప్పగలరా అని సవాల్ విసిరారు. పోలీసులు భాజపా కార్యకర్తలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం, మంచిర్యాలలో పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను కార్యకర్తల్లా ఉపయోగించుకుంటుందని దుయ్యబట్టారు. పోలీసులు బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో భాజపా సర్కార్ ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. పన్నుల పెంపు లేదు, వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, బస్తీ దవాఖానలు, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి, క్లీన్ సిటీ, గ్రీన్ టౌన్. 100 శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ , దేవాలయాల రక్షణ, మహిళల రక్షణ. మున్సిపాలిటీల్లో దోమలు, పందులు, కుక్కలు, కోతుల బెడద నివారణ. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి కోసం బీజేపీ మేనిఫెస్టో అంటూ రూపకల్పన తొలిసారి తెలంగాణలో అన్ని మున్సిపల్ వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ మెజారిటీ స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేయాలని పార్టీ పట్టుదలతో ఉంది. 60 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కనీసం 5 కార్పొరేషన్లను దక్కించుకోవాలని టార్గె÷ట్ పెట్టుకుంది. ఇందుకోసం స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కష్టపడుతున్నారు. బీజేపీ యువ మోర్చాకు ఈ ఎన్నికల్లో ప్రత్యేక టాస్క్ ఇచ్చారు. జెన్–జీ టార్గెట్‌గా ప్రచారంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశర చేశారు..

# వికసిత భారత్ నిర్మాణ లక్ష్యంగా బడ్జెట్

## బడ్జెట్‌పై ఏర్పాటైన కార్యక్రమంలో ప్రహ్లాద్ జోషి

**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2047వరకు వికసిత భారత్ నిర్మాణ లక్ష్యంగా ఉందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.. తాజాగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోనే భారత్ ను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మోడీ కృషి చేస్తున్నారని చెప్పారు.. ఏఐ జనరేషన్ నడుస్తున్న పరిస్థితుల్లో కొత్త సంస్కరణలు తీసుకు వస్తున్నామని స్పష్టం చేశారు.. స్వాతంత్ర్యం సిద్ధించాక కాంగ్రెస్ సుదీర్ఘ కాలం దేశాన్ని పరిపాలించింది.. ప్రపంచంలోనే భారత్ మూడోవ ఆర్థిక శక్తిగా ఎదుగుతుందన్నారు.. ఇది భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశిరచుకుని రూపొందించిన బడ్జెట్ అని.. ఇందులో మౌలిక సదు–పాయాల కల్పనకు పెద్ద పీట వేశామని చెప్పారు..



కొంత మంది వ్యక్తులు బడ్జెట్ ను విమర్శిస్తున్నారని.. తెలంగాణకు ఏమీ ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు.. 5 వేల కిలో మీటర్ల జాతీయ రహదారులు ఇచ్చామని చెప్పారు..పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు నిధులతో పాటు గ్రాంట్లు ఇచ్చామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు.. ఆత్మ నిర్భర భారత్ కింద తెలంగాణలోని 42 రైల్వే స్టేషన్లు ఆధునికీకరించాం.. ఏడు హై స్పీడ్ రైల్ కారిడార్లలో.. మూడు హైదరాబాద్ కే కేంద్రం ఇచ్చింది.. కొన్ని పార్టీల నాయకులు తెలంగాణకు ఏమీ ఇవ్వలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. తెలంగాణ ప్రజల పట్ల మోడీకి ప్రేమ ఉంది.. మోడీపైన తెలంగాణ ప్రజలకు ప్రేమ ఉంది.. వీబీ జీ రామ్ జీ వల్ల ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేశారని తప్పుడు ప్రచారం చేశారు.. వీబీ జీ రామ్ జీకి బ్జడెట్లో గతం కంటే ఎక్కువ నిధులు కేటాయించడం జరిగిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

# మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ

## ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న : తెలంగా జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నాన న్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదిలావుంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై జాగృతి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.



# తెలంగాణలో పవన్ ప్రచారం రద్దు

**నల్లగొండ,ఫిబ్రవరి6 :** తెలంగాణలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన రద్దు అయ్యింది.. ఆదివారం నల్గొండలో బీజేపీ తరఫున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని ముందే ప్రకటించింది తెలంగాణ బీజేపీ.. అయితే, తాజాగా పవన్ పర్యటన రద్దు అయినట్టు వెల్లడించింది.. ఏపీలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు.. వ్యక్తిగత కారణాలతో పవన్ పర్యటన రద్దయ్యిందని ప్రకటించింది బీజేపీ.. ఇక, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 336 వార్డుల్లో జనసేన పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.. ఈ నెల 11వ తేదీన జరగనున్న తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 336 వార్డుల్లో జనసేన పార్టీ పోటీ చేస్తున్నట్టు పార్టీ ప్రకటించింది.. ఇందుకు సంబంధించి పార్టీ అభ్యర్థుల ః–ఫారమ్‌లు దాఖలు చేయగా, స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను ఆమోదించారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు గాజు గ్లాస్ గుర్తుపై పోటీ చేయనున్నారని పార్టీ వెల్లడించింది..



# మెంతులను వీటితో కలిపి తినండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!



మన వంటగదిలో ఉండే అనేక రకాల దినుసుల్లో మెంతులు కూడా ఒకటి. వీటిని మనం అనేక రకాల వంటకాల్లో వాడుతూ ఉంటాం. మెంతులు వేయడం వల్ల వంటలకు ఒక ప్రత్యేకమైన రుచి వస్తుంది. మెంతులను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో అనేక రకాల పోషకాలు, ఔషధ గుణాలు ఉంటాయి. ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. మెంతుల్లో కరిగే ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల కార్బొహైడ్రేట్స్ ను శరీరం నెమ్మదిగా శోషిస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. అంతేకాకుండా మెంతులల్లో 4- హైడ్రాక్సీఐసోలూసిన్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. మెంతులను నానబెట్టి లేదా భోజనంలో కలిపి తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే ఇతర ఆహారాలతో కలిపి మెంతులను తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

### ఇన్సులిన్ సెన్సిటివిటీ..

మెంతులను నానబెట్టి ఆ నీటిలో కొద్దిగా దాల్చిన చెక్క పొడి కలిపి తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది, గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంటాయి. దాల్చిన చెక్క కూడా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో మనకు సహాయపడుతుంది. దాల్చిన చెక్క పొడిని తీసుకోవడం వల్ల ఫాస్టింగ్ ప్లాస్మా గ్లూకోజ్ స్థాయిలతో పాటు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు, ట్రైగ్లిజరాయిడ్స్ కూడా తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు. మెంతి గింజలను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయం ఆ నీటిని తీసుకునే ముందు అందులో దాల్చిన చెక్క పొడి వేసి కలిపి తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అదే విధంగా తాజా ఉసిరి రసంలో మెంతి గింజల పొడిని కలిపి తీసుకోవడం వల్ల మనం అనేక ఫలితాలను పొందవచ్చు. ఉసిరిలో విటమిన్ సితో పాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి పాంక్రియాటిక్ పనితీరును మెరుగుపరచడంలో, గ్లూకోజ్ జీవక్రియకు మద్దతు ఇవ్వడంలో సహాయపడతాయి. రోజూ ఒక గ్రాము ఉసిరి సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల గ్లూకోజ్, సీపిఆర్ సాంద్రతలు మెరుగుపడతాయి.

### అవిసె గింజలతో..

ఇక అవిసె గింజలను, మెంతి గింజలను కలిపి తీసుకోవడం వల్ల చక్కెర శోషణ నెమ్మదిస్తుంది. భోజనం తరువాత చక్కెర స్థాయిల్లో వచ్చే హెచ్చుతగ్గులు తగ్గుతాయి. అవిసె గింజలను, మెంతులను కలిపి తీసుకోవడం వల్ల 24 గంటలకు పైగా రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా నమోదయ్యాయని పరిశోధనల్లో వెల్లడైంది. వీటిని కలిపి తీసుకోవడం వల్ల రాత్రి సమయంలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తక్కువగా ఉంటాయి. పాన్‌కేక్స్, మఫిన్స్ వంటి వాటి తయారీలో అవిసె గింజలను, మెంతులను వేసి తయారు చేసి తీసుకోవచ్చు. ఇలా తీసుకోవడం వల్ల రుచితో పాటు ఆరోగ్యాన్ని పొందవచ్చు. అలాగే పసుపును, మెంతులను కలిపి తీసుకోవడం వల్ల కూడా రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.

### పసుపుతో..

పసుపులోని కర్కుమిన్ ఇన్సులిన్ నిరోధకతను, హైపర్ గ్లైసీమియా, హైపర్ లిపిడెమియా వంటి మధుమేహ సంబంధిత సమస్యలపై సానుకూల ప్రభావాన్ని చూపిస్తుందని పరిశోధనల ద్వారా నిరూపితమైంది. గోరు వెచ్చని పాలల్లో లేదా నీటిలో పసుపు, మెంతి గింజల పొడి కలిపి తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే వంటల్లో కూడా పసుపు, మెంతి గింజల పొడి వేసి తీసుకోవచ్చు. ఈ విధంగా మెంతి గింజలను ఇతర ఆహారాలతో కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.



## కాఫీని అధికంగా తాగితే ఏం జరుగుతుంది..? ఎవరు తాగకూడదు..?

మనం ఎక్కువగా తీసుకునే పానీయాల్లో కాఫీ ఒకటి. చాలా మంది కాఫీని ఇష్టంగా తాగుతూ ఉంటారు. అలసట నుండి బయటపడడానికి, శరీరానికి ఉత్తేజాన్ని ఇవ్వడానికి కాఫీ ఎంతో సహాయపడుతుంది. కాఫీని తాగడం వల్ల ఒత్తిడి తగ్గి చేసే పనిపై ఏకాగ్రత పెరుగుతుంది. శరీరానికి శక్తిని అందిస్తుంది. ఇలా అనేక రకాలుగా కాఫీ మనకు మేలు చేస్తుందని చెప్పవచ్చు. అయితే కాఫీని తీసుకోవడం వల్ల కొన్ని అనారోగ్య సమస్యలు ఎక్కువవడంతో పాటు కొత్త అనారోగ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కాఫీ తాగడం వల్ల గుండె దడ ఎక్కువయ్యే అవకాశం ఉందని ఇది ఆందోళన స్థాయిలను పెంచుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

### జీర్ణ సమస్యలు ఉంటే..

కెఫిన్ శరీరం, మనస్సును ఉత్తేజపరుస్తుంది. నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. దీంతో మరింత ఆందోళనకు గురవుతారు. అలాగే ఇప్పటికే ఆందోళన ఉన్నవారు కాఫీని తాగడం వల్ల అది మరింత తీవ్రతరం అవుతుంది. అలాగే జీర్ణ సమస్యలతో ఇబ్బందిపడే వారు, ఆమ్లత్వం సమస్యను ఎదుర్కొనే వారు కాఫీ తాగడం పట్ల జాగ్రత్త వహించాలి. కాఫీ తాగడం వల్ల యాసిడ్ రిఫ్లెక్స్ మరింత ఎక్కువవుతుంది. పేగుల సున్నితత్వం పెరుగుతుంది. ఆహారం జీర్ణమవ్వడం కష్టమవుతుంది. జీర్ణవ్యవస్థతో మొత్తం శరీర ఆరోగ్యం అనుసంధానమై ఉంటుంది కనుక మొత్తం ఆరోగ్యం ప్రభావితమవుతుంది. అదేవిధంగా గర్భిణీలు కూడా కాఫీని తీసుకోకపోవడమే మంచిది అని వైద్యులు చెబుతున్నారు. కెఫిన్ పిండం పెరుగుదలను ప్రభావితం చేస్తుంది. కాఫీ తాగడం వల్ల శిశువు తక్కువ బరువుతో పుట్టడం, గుండె, జననేంద్రియ లోపాలు, న్యూరో సమస్యలు రావడం వంటివి కూడా జరుగుతాయని వైద్యులు తెలియజేస్తున్నారు.

### రక్తపోటు, గుండె సమస్యలు ఉన్నవారు..

ఇక అధిక రక్తపోటు, గుండె సమస్యలతో బాధపడే వారు కూడా కాఫీని తీసుకోకపోవడమే మంచిదని వారు సూచిస్తున్నారు. కాఫీ తాగడం వల్ల రక్తపోటు మరింత పెరుగుతుంది. కెఫిన్ అడ్రినలిన్ విడుదలను ప్రేరేపిస్తుంది. ఇది గుండె మరింత వేగంగా కొట్టుకునేలా చేస్తుంది. దీంతో రక్తపోటు కూడా పెరుగుతుందని రక్తనాళాలు కూడా ప్రభావితం అవుతాయని వారు చెబుతున్నారు. ఇవన్నీ కూడా కాలక్రమేణా గుండె సమస్యలకు దారి తీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా కాఫీ తాగడం వల్ల శరీరం ఇన్సులిన్ కు ప్రతిస్పందించే సహజ సామర్థ్యాన్ని కూడా కోల్పోతుందని వారు తెలియజేస్తున్నారు. కనుక మనం తాగే కాఫీ మన శరీరానికి శక్తి ఇచ్చేదిగా ఉండాలే తప్ప అనారోగ్యాన్ని కలిగించేదిగా ఉండకూడదని వైద్యులు చెబుతున్నారు. కనుక కాఫీ తాగే వారు వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కాఫీని తాగాలా వద్దా అని నిర్ణయించుకోవాలి. అలాగే ఆరోగ్యవంతులు కూడా కాఫీ తాగినప్పటికీ అది మితంగా ఉండేలా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## ఉదయం ఈ బ్రేక్‌ఫాస్ట్‌లను తింటున్నారా..? అయితే కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి జాగ్రత్త..!

అల్పాహారం రోజులో ఎంతో ముఖ్యమైన భోజనం అని చెప్పవచ్చు. మనం రోజంతా ఉత్సాహంగా ఉండడానికి, రోజంతా అలసట లేకుండా పని చేసుకోవడానికి, మన రోజు సంతోషంగా గడవడానికి అల్పాహారం తీసుకోవడం చాలా అవసరం. మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో ఆహారాన్ని తీసుకున్నా లేదా తీసుకోకపోయినా అల్పాహారం విషయంలో మాత్రం అస్సలు నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు చెబుతుంటారు. అలాగే మనం తీసుకునే అల్పాహారం మన ఆరోగ్యానికి శక్తిని, పోషకాలను అందించేదిగా ఉండాలని కూడా వారు చెబుతూ ఉంటారు. అయితే మనం తీసుకునే కొన్ని అల్పాహారాలు గుండె ఆరోగ్యానికి అంత మంచివి కావు. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. గుండెపోటుతో పాటు ఇతర గుండె సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సులభంగా, వేగంగా తయారు చేసుకోదగిన కొన్ని అల్పాహారాలు దీర్ఘకాలిక గుండె ఆరోగ్యానికి హానిని కలిగిస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను ఎక్కువగా పెంచే కొన్ని అల్పాహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



### కార్న్ ఫ్లేక్స్..

చక్కెరతో నిండిన కార్న్‌ఫ్లేక్స్ వంటి వాటిని చాలా మంది ఆహారంగా తీసుకుంటూ ఉంటారు. వీటిని తయారు చేయడం చాలా సులభమైనది కనుక ఉదయం పూట బిజీగా ఉండే వారు వీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. కార్న్‌ఫ్లేక్స్ వంటివి శుద్ధి చేసిన చక్కెరతో నిండి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ట్రైగ్లిజరాయిడ్స్ పెరుగుతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. డోనట్స్, క్రోసెంట్స్, మఫిన్లు వంటి వాటిని కూడా అల్పాహారంలో భాగంగా తీసుకుంటూ ఉంటారు. ఇవి రుచిగా ఉండడం వల్ల సరైన అల్పాహార ఎంపికగా చాలా మంది భావిస్తారు. కానీ ఇవి శుద్ధి చేసిన పిండి ( మైదా), ట్రాన్స్ ఫ్యాట్స్ తో నిండి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల చెడుకొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడంతో పాటు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది.

### పూరీలు, బ్రెడ్..

ఉదయం పూట అల్పాహారంలో భాగంగా చాలా మంది పూరీలను తింటూ ఉంటారు. వీటిలో సంతృప్త కొవ్వులు, సోడియం వంటివి ఎక్కువగా ఉంటాయి. పూరీలను తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా పెరుగుతాయి. ఇక చాలా మంది అల్పాహారంలో ఒక కప్పు ఫుల్ ఫ్యాట్ మిల్క్, చీజ్ లేదా ఫుల్ ఫ్యాట్ క్రీమ్ వంటివి వాటిని కాఫీతో కలిపి తీసుకుంటూ ఉంటారు. ఇవి రుచిగా ఉన్నప్పటికీ వాటిలో సంతృప్త కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. తద్వారా గుండె ఆరోగ్యం దెబ్బతింటుంది. బ్రెడ్ ను కూడా చాలా మంది అల్పాహారంగా తీసుకుంటూ ఉంటారు. బ్రెడ్ తో రకరకాల వంటకాలు చేసి పిల్లలకు కూడా ఇస్తూ ఉంటారు. బ్రెడ్ ను శుద్ధి చేసిన పిండితో తయారు చేస్తారు. కనుక దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంతో పాటు కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా పెరుగుతాయి. అంతేకాకుండా బ్రెడ్ లో పోషకాలు తక్కువగా ఉంటాయి. కానీ క్యాలరీలను, కార్బొహైడ్రేట్స్ ను మాత్రం అధికంగా అందిస్తాయి.

### గుండె ఆరోగ్యానికి హాని..

అలాగే చాలా మంది ప్రయాణాల్లో సులభంగా ఉంటుందని ప్రీ ప్యాక్డ్ బ్రేక్‌ఫాస్ట్ బార్స్ ను తీసుకుంటూ ఉంటారు. ఇవి ప్రయాణానికి అనుకూలంగా ఉన్నప్పటికీ వీటిలో చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వులు, కృత్రిమ పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కనుక వీటిని తీసుకోకపోవడం మంచిది. ఉదయం పూట సమయం తక్కువగా ఉంటుందని చాలా మంది త్వరగా అయ్యే అల్పాహారాలను తీసుకుంటూ ఉంటారు. అలాగే కొంతమంది రుచిని దృష్టిలో పెట్టుకుని నూనెలో వేయించిన అల్పాహారాలను తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. ఇవన్నీ కూడా కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంతో పాటు మన గుండె ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. కనుక మనం తీసుకునే అల్పాహారం మన ఆరోగ్యానికి మేలు చేసేదిగా అయి ఉండాలని, శరీరానికి రోజంతా పనిచేయడానికి కావల్సిన శక్తిని, పోషకాలను అందించేదిగా ఉండాలని వైద్యులు తెలియజేస్తున్నారు.

## రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్నాయా..? ఈ ఆహారాలను తీసుకుంటే మేలు జరుగుతుంది..!

శరీరం గుండా ఆక్సిజన్ ను, రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు ధమనులు. గుండె ఆరోగ్యం ఉండడంలో ఇవి ముఖ్య పాత్ర పోషిస్తాయి. ధమనుల లోపలి గోడల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల ధమనులు మూసుకుపోతాయి. కాలక్రమేణా ఇది రక్తసరఫరాను తగ్గిస్తుంది. దీని వల్ల గుండెపోటు, స్ట్రోక్ లేదా మరణం వంటివి వచ్చే ప్రమాదం ఉంది. కనుక ధమనులు మూసుకుపోకుండా జాగ్రత్త వహించాలి. ధమనులు ఆరోగ్యంగా ఉంటేనే గుండె ఆరోగ్యంగా, గుండెపై ఎక్కువగా ఒత్తిడి పడకుండా ఉంటుంది. కనుక ధమనుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా చాలా అవసరం. మనం తీసుకునే కొన్ని రకాల ఆహారాల ద్వారా ధమనుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ధమనులు మూసుకుపోయిన సమస్యతో బాధపడే వారు అలాగే ఈ సమస్య రాకూడదు అని భావించే వారు ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ధమనుల ఆరోగ్యాన్ని కాపాడే, మూసుకుపోయిన ధమనుల సమస్యను తగ్గించే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఓట్స్, సుగంధ్ర ద్రవ్యాలు..

మూసుకుపోయిన ధమనుల సమస్యతో బాధపడే వారు ఓట్స్ ను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ఫైబర్ తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడంలో, శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. ఓట్స్ ను తీసుకోవడం వల్ల ధమనుల్లో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోకుండా ఉండడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. సుగంధ ద్రవ్యాల్లో కూడా యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు అధికంగా ఉంటాయి. ఫ్రీరాడికల్స్ ను తగ్గించడంలో ఇవి ఎంతో దోహదపడతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గడం వల్ల ధమనులు, గుండె ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అల్లం, మిరపకాయలు, దాల్చిన చెక్క, మిరియాలు వంటి వాటిని తీసుకోవడం వల్ల ధమనులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు గుండె జబ్బులు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుంది.

### టమాటాలు..

ధమనులు మూసుకుపోకుండా నిరోధించడంలో టమాటాలు అద్భుతంగా పనిచేస్తాయి. టమాటాల్లో లైకోపీన్, విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్, విటమిన్ ఇ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. టమాటాలను అల్లం, దాల్చిన చెక్క వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపి తీసుకోవడం వల్ల మరింత మేలు కలుగుతుంది. అలాగే ధమనులు మూసుకుపోకుండా చేయడంలో క్యాబేజి, బ్రోకలీ, కాలీఫ్లవర్ వంటి కూరగాయలు ఎంతో దోహదపడతాయి. వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ధమనులు మూసుకుపోయే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సిట్రస్ జాతి పండ్లను తీసుకోవడం వల్ల గుండె జబ్బులతో పాటు గుండెపోటు వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుంది. ఈ పండ్లల్లో విటమిన్స్, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ ను తగ్గించి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.



### చేపలు..

చేపలను తీసుకోవడం కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వీటిలో ఒమెగా 3ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గేలా మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తాయి. చేపలను తీసుకోవడం వల్ల వాపు తగ్గడంతో పాటు రక్తం గడ్డకట్టడం కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ విధమైన ఆహారాలను తీసుకోవడం వల్ల ధమనులు మూసుకుపోవడం తగ్గడంతో పాటు ఈ సమస్య భవిష్యత్తులో కూడా రాకుండా ఉంటుందని, ఈ ఆహారాలు గుండె ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

# జిన్నారంను మున్సిపాలిటీ చేసి భారం మోపిన కాంగ్రెస్

**పన్నుల భారం మోపినోళ్లకు ఓటేద్దామా చెప్పండి**

**కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బతుకుల బాగుపడతాయి**

**మున్సిపల్ ప్రచారంలో నిలదీసిన హరీష్ రావు**



**సంగారెడ్డి, ఫిబ్రవరి 6 :** కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జిన్నారంను మున్సిపాలిటీ చేసి మీ మీద పన్నుల భారం మోపిందని, ఇప్పుడు ఎవరికి ఓటేద్దాం..? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు ఓటర్లను ప్రశ్నించారు. మనల్ని మంచిగా చూసుకున్న వాళ్ళకు, మన భారాన్ని తగ్గించే వాళ్ళకే ఓటేద్దామని అన్నారు. హరీష్‌రావు పటాన్‌చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో శుక్రవారం పర్యటించారు. జిన్నారం గ్రామం వాకిటి వద్ద స్థానికులతో ముచ్చటించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిన్నారం గ్రామం గ్రామపంచాయతీగానే ఉండాలని కోరుకున్నామని, మున్సిపాలిటీ అయితే ప్రజల మీద పన్నుల భారం పడుతుందని ఆపామని చెప్పారు. కానీ కేసీఆర్ రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఆ హామీని నెరవేర్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి రెండేళ్లు గడిచినా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏపీలో చంద్రబాబు రూ.4000 ఇస్తానని చెప్పి ఇస్తున్నాడు కదా? మరి ఇక్కడ రేవంత్ రెడ్డికి ఎందుకు చేతులు రావడం లేదు..? అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశాడని హరీష్‌రావు విమర్శించారు. ఈ 24 నెలల్లో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.60,000 చొప్పున బాకీ పడిందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు బతుకమ్మకు ప్రతి మహిళకు చీర ఇచ్చేదని, రేవంత్ రెడ్డి వచ్చాక చీర లేదు, గాజులు లేవని చెప్పారు. ఏదో గ్రూపులో ఉన్న కొద్దిమందికి ఇచ్చి చేతులు దులుపుకున్నాడని అన్నారు. ఫ్రీ బస్సు అని చెప్పి మగవాళ్లకు టికెట్ రేట్ డబుల్ చేశాడని తెలిపారు. ఆడోళ్ళకు సీటు దొరక్క తిప్పలు పడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చాక 5 పంటలు వస్తే.. రెండింటికి ఇచ్చి మూడింటికి రైతుబంధు ఎగ్గొట్టాడని విమర్శించారు. నాటేసిన వాళ్లకే రైతుబంధు ఇస్తా, శాటిలైట్‌లో చూసి ఇస్తా అని కొత్త నిబంధనలు పెట్టి రైతులను గోస పెడుతున్నాడని రేవంత్‌రెడ్డిపై హరీష్‌రావు మండిపడ్డారు. దేవుడి మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పిన పాపాత్ముడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఏ ఊర్లో చూసినా సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో మీరు కారు గుర్తుకు ఓటు గుద్దితే.. రేవంత్ రెడ్డికి గూబ గుయ్యిమనాలె అని పిలుపునిచ్చారు. అప్పుడే భయపడి హామీలైనా అమలు చేస్తాడని అన్నారు. ఓటుకు 5 వేలు ఇస్తామంటారని, అవి తీసుకొని మోసపోవద్దని హెచ్చరించారు. మహిళలకు రావాల్సిన రూ.60,000, అవ్వ తాతలకు రూ.4000 పెన్షన్ రావాలంటే బీఆర్ఎస్ గెలవాలని అన్నారు. అవ్వతాతలు పెన్షన్ అడిగితే లాగుల తొండలు ఇడిసిపెడతా అంటాడని, మహిళలు హామీల గురించి అడిగితే మెడలో పేగులు వేసుకుంటా అంటాడని, తులం బంగారం ఏదని అడిగితే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడని హరీష్‌రావు సీఎంను విమర్శించారు. ప్రశ్నిస్తే కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి సీఎం అహంకారాన్ని దించాలని పిలుపునిచ్చారు. రెండేళ్లు ఓపిక పట్టాలని, వచ్చేది మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. జిన్నారం సమస్యలు పరిష్కరించుకుందామని చెప్పారు. రేవంత్ రెడ్డి ముస్లింలకు ఒక్క రూపాయి పని కూడా చేయలేదని, కాబట్టి అందరూ ఏకమై కారు గుర్తు అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## పార్టీలో తన వర్గాన్ని దూరం పెట్టారు

**రాజకీయంగా దెబ్బకొట్టేందుకు యత్నాలు**

**కాంగ్రెస్ తీరుపై జీవన్ రెడ్డి ఆవేదన**

**జగిత్యాల, ఫిబ్రవరి6 :** జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నికల్లో తన వర్గానికి సీట్లు కేటాయించకుండా పక్కకు పెట్టడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయంగా తన మెడ నరకడానికి కాంగ్రెస్ పార్టీలో ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తన భుజాలుగా ఉన్న వ్యక్తులను తనకు దూరం చేశారని చెప్పారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టమని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ప్రచారం సందర్భంగా పార్టీకి చెందిన మహిళలు, కార్యకర్తలతో ఆయన తన బాధను చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నారు. దాంతో వారు జీవన్‌రెడ్డిని ఓదార్చారు. మున్సిపాలిటీలో తాము మీ వర్గాన్ని గెలిపించి తీరుతామని చెప్పారు. కాగా చట్టసభలకు ఏ పార్టీ తరపున గెలిస్తే ఆ పార్టీలోనే ఉండాలని గతంలో రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ఆయన పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని గతంలో చెప్పారని, కానీ ఆయనే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వేరే పార్టీల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వాళ్లను ఓటుతో కొట్టాలని తాను అంటున్నానని చెప్పారు. తన వర్గం వారికి కాంగ్రెస్ సీట్లు నిరాకరించడంతో కొన్ని వార్డుల్లో స్వతంత్యులుగా బరిలో దిగిన తన వర్గం వారి తరపున జీవన్‌రెడ్డి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన వర్గాన్ని పక్కనపెట్టి.. తనతోపాటు బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సంజయ్ కుమార్ తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెబుతున్నారని, కానీ కాంగ్రెస్ జెండా పట్టుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లోనే ఉన్నా అంటూ సంజయ్ కాంగ్రెస్ జెండాను ఎత్తుకుపోయాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో దొంగలు పడ్డారని వ్యాఖ్యానించారు.

## మార్చిలో ప్రారంభానికి సిద్ధమైన సనత్‌నగర్ ఆస్పత్రి

**మంత్రి ఆదేశాలతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పరిశీలన**

**ఫిబ్రవరి 28లోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**ఫిబ్రవరి 12 నుంచి విధుల్లోకి 100 మంది వైద్య సిబ్బంది**

**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** సనత్‌నగర్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ను మార్చిలో ప్రారంభించేందుకు చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. రోడ్లు / భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణాన్ని విస్తృతంగా పరిశీలించారు. ఇంజనీరింగ్ ప్రతినిధులతో కలిసి అన్ని అంతస్తులలో కొనసాగుతున్న పనులను సమీక్షించారు. ఎమర్జెన్సీ విభాగం, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, సెంట్రల్ స్టెరైల్ సర్వీసెస్ విభాగం సిద్ధతను ప్రత్యేకంగా పరిశీలించారు. ఫిబ్రవరి 28లోగా మిగిలిన అన్ని సివిల్, మౌలిక వసతుల పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆసుపత్రి అంతటా సైన్‌బోర్డులు వంటి సహాయక వసతులను ఈ నెలాఖరులోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈపీసీ పరిధిలోని వైద్య పరికరాలన్నీ ఇప్పటికే అమర్చినట్లు కాంట్రాక్టర్ వెల్లడించగా, మొత్తం 540 వైద్య మరియు అనుబంధ పరికరాల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఆసుపత్రి కార్యకలాపాల ప్రారంభానికి ముందుగా పరికరాల పరీక్షలు, ట్రయల్ రన్స్ నిర్వహించేందుకు వైద్య, సాంకేతిక సిబ్బందిని వెంటనే నియమించాలని వైద్య విద్యా డైరెక్టర్‌ను ఆదేశించారు. ఫిబ్రవరి 12 నుంచి 28 మధ్య తొలి దశలో 100 మంది వైద్య, పారా వైద్య మరియు హౌస్‌కీపింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. నెలాఖరుకు పూర్తి సిబ్బంది నియామకం పూర్తవుతుందని వెల్లడించారు.మార్చిలో సనత్‌నగర్ ప్రజలకు అందుబాటులోకి రానుండటంతో, హైదరాబాద్ నగరానికి మరో కీలక ప్రభుత్వ వైద్య సంస్థగా ఇది నిలవనుందని అధికారులు తెలిపారు.

## ఏడుపాయలలో శివరాత్రి జాతర

**15 నుంచి 17 వరకు నిర్వహణ**



**మెదక్,ఫిబ్రవరి6 :** అత్యంత వైభవంగా జరిగే రెండో అతిపెద్ద జాతరగా గుర్తింపు పొందిన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గా భవాని మాత మహాజాతరకు ముహూర్తం ఖరారైంది. ఏడు పాయల మధ్య వెలిసిన ఆ వనదుర్గమ్మ కు శివరాత్రి సందర్భంగా జాతర నిర్వహిస్తారు. ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం , ఆలయ కమిటీ సర్వ సిద్ధం చేస్తోంది. మంజీరా నది ఏడు పాయలుగా విడిపోయి, అమ్మవారి పాదాల చెంత నుంచి ప్రవహించే ఈ పవిత్ర క్షేత్రానికి ఏటా కోట్లాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా జాతరలో భాగంగా మొదటి రోజు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకోనున్నారు. రెండో రోజైన ఫిబ్రవరి 16న జాతరలోనే ప్రధాన ఘట్టమైన 'బండ్ల ఉత్సవం' అత్యంత కోలాహలంగా సాగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తమ ఎడ్లబండ్లను రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదర్శనగా తిరుగుతూ మొక్కులు తీర్చుకుంటారు. ఆఖరి రోజైన ఫిబ్రవరి 17న రథోత్సవంతో ఈ మహా క్రతువు ముగుస్తుంది. ఈ జాతరకు కేవలం మెదక్ జిల్లా నుంచే కాకుండా సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ , పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుండి కూడా సుమారు 15 లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ భారీ జనసమూహానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు స్నానాల సమయంలో ఇబ్బంది కలగకుండా మంజీరా నదిలోకి నీటిని విడుదల చేయడంతో పాటు, ఘాట్ రోడ్ల మరమ్మతులు, బారికేడ్ల నిర్మాణం , తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు. రవాణా సౌకర్యం కోసం తెలంగాణ ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులను నడపనుంది. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, భారీ పోలీస్ బందోబస్తును కూడా మోహరిస్తున్నారు. వనదుర్గమ్మ ఆశీస్సుల కోసం వచ్చే భక్తులందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఈ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## మద్రాస్ హైకోర్టులో నటుడు విజయ్‌కు చుక్కెదురు

**ఆదాయపన్ను శాఖ జరిమానాపై పిటిషన్ కొట్టివేత**

**చెన్నై,ఫిబ్రవరి6 :** మద్రాసు హైకోర్టులో నటుడు, టీవీకే అధినేత విజయ్ కు చుక్కెదురైంది. ఆదాయపన్ను శాఖ విధించిన పెనాల్టీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించగా.. విచారించిన న్యాయస్థానం విజయ్ పిటిషన్‌ను కొట్టేసింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది. దీనిపై 2022లో విజయ్ హైకోర్టును ఆశ్రయించారు. గత నెలలో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు.. ఇప్పుడు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయపన్ను రిటర్న్ దాఖలు చేసినప్పుడు ఆ ఏడాది విజయ్ రూ.35 కోట్లు ఆదాయం పొందినట్లు ఆదాయ పన్ను శాఖ మద్రాసు హైకోర్టులో నివేదిక దాఖలు చేసింది. అందుకు సంబంధించి మదింపు చేపట్టిన ఆదాయపన్ను శాఖ విజయ్ ఇంట్లో జరిపిన సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను సరిచూడగా 'పులి' సినిమాకు తీసుకున్న రూ.15 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో చూపలేదని తేలింది. ఆ ఆదాయాన్ని దాచినందుకు రూ.1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఆదాయపన్ను శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ విజయ్.. మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. విజయ్ నటించిన కొత్త సినిమా 'జన నాయగన్' వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనే ఉత్కంఠ ఇంకా వీడలేదు. ఈ క్రమంలో పన్ను జరిమానా కేసులో విజయ్ రిట్ పిటిషన్‌ను మద్రాస్ హై కోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2015 సెప్టెంబర్ 30న ఐటి అధికారులు నిర్వహించిన సోదాలను అనుసరించి మాత్రమే నటుడు విజయ్ పన్నులు చెల్లించారని, అంతకు ముందు వచ్చిన ఆదాయానికి సంబంధించి కాదని, ఐటి శాఖ విధించిన జరిమానాను రద్దుచేయలేమని జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి తీర్పునిచ్చారు. ఆదాయపన్ను చట్టం ప్రకారం నిర్దేశించిన కాల పరిమితిలోపు జరిమానా ఉత్తర్వు జారీ చేయబడిందని ఆయన తేల్చారు. 015-16 ఆర్థిక సంవత్సరంలో అదనపు ఆదాయాన్ని స్వచ్ఛందంగా వెల్లడించినందుకు ఆదాయ పన్ను శాఖ తనకు రూ.1.50కోట్ల జరిమానా విధించడాన్ని వ్యతిరేకిస్తూ 2022లో నటుడు విజయ్ రిట్ పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. 2015లో వచ్చిన పులి సినిమా నిర్మాతలు, ఎస్‌కెటి స్టూడియోస్‌కు చెందిన పి.టి.సెల్వకుమార్, శిబు చెక్కుల ద్వారా రూ.16కోట్ల పారితోషకంతో పాటు రూ.4.93 కోట్ల నగదును చెల్లించారని, చెక్కు మొత్తానికి మాత్రమే పన్ను మినహాయింపు (టిడిఎస్) జమ చేశారని, నగదు లావాదేవీకి కాదని ఐటి శాఖ పేర్కొంది.

## మిర్చిరైతులకు మంచి రోజులు

**వరుసగా పెరుగుతున్న ధరలతో ఆనందం**

**వరంగల్,ఫిబ్రవరి6 :** మిర్చి రైతులకు చాలాకాలం తరవాత మంచిరోజులు వచ్చాయి. పంటలకు గణనీయంగా ధరలు పలుకుతున్నాయి. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు ఘాటెక్కుతున్నాయి. గత రికార్డులను బ్రేక్ చేస్తూ వండర్‌హాట్ రకం మిర్చి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.38వేల ధర పలికి రికార్డు సృష్టించింది. ఏనుమాముల మార్కెట్‌కు మిర్చి రాబడులు గణనీయంగా తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కాగా, బుధవారం వండర్‌హాట్ మిర్చి రూ.37,100 ధర పలికి ఆల్‌టైం రికార్డు సృష్టించగా, ఒక్క రోజు వ్యవధిలోనే రూ.900 పెరిగి రూ.38వేలు పలకడం విశేషం. వరుసగా రెండు రోజుల నుంచి మిర్చి ధరలు రికార్డు స్థాయికి చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వండర్‌హాట్, 341 రకాలను సాగు చేసిన రైతులకు మంచి లాభాలు వస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే యూఎస్ 341 రకం మిర్చికి రూ. 26,700, దీపిక రకం మిర్చికి రూ.27వేలు, తేజ రకం మిర్చికి రూ.19,500, పత్తికి రూ.7,630, మినుములకు రూ.8,602, పెసర్లకు రూ.8,352 గరిష్ఠంగా ధరలు పలికాయి. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. బుధవారం రూ.7,700 ఉండగా ఒక్క రోజులో క్వింటాల్‌కు రూ.70 తగ్గి రూ.7,630కి పడిపోయింది. దీంతో ధరలో స్వల్ప తగ్గుదల చోటు చేసుకుంది.

## 12న దేశవ్యాప్త కార్మిక సమ్మె

**విజయవంతానికి కృషి చేద్దామన్న దాస్యం**

**హనుమకొండ,ఫిబ్రవరి6 :** ఈనెల 12న జరిగే కార్మిక దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల ఉమ్మడి సన్నాహక సమావేశాన్ని శుక్రవారం హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్ర భుత్వం రైతు, కార్మిక, ఉద్యోగుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్మికులకు, ఉద్యోగులకు పనిభారం పెంచి, వేతనాలు తగ్గించి శ్రమ దోపిడీ చేసేందుకు పెట్టుబడిదారుల కుట్రలకు కేంద్రం వత్తాసు పలుకుతూ నాలుగు లేబర్ కోడ్స్?ను తీసుకొచ్చిందని వివరించారు. రైతుల స్ఫూర్తితో కార్మికులు హక్కుల సాధన కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. అసంఘటిత, సంఘటిత కార్మిక సంఘాలన్నీ కలిసి ఈనెల 12న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ, బీఆర్టీయూ, టీఎన్టీయూసీ, ఐఎఫ్ టీయూ, ఏఐసీటీయూ, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వాట్సాప్ మీ సేవకు ఆదరణ

**3.25 లక్షల మందికి డిజిటల్ పౌర సేవలు**

**హైదరాబాద్,ఫిబ్రవరి6 :** తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ మీ సేవ విధానానికి అత్యధిక ప్రజాదరణ లభించిందని సర్కార్ శుక్రవారం వెల్లడించింది. దీంతో ఇప్పటివరకూ 3.25 లక్షల మందికి డిజిటల్ పౌర సేవలు అందినట్లు వివరించింది. ఈ వాట్సాప్‌లో 4.5 లక్షల మంది నమోదు చేసుకోగా.. 3.25 లక్షల మంది ఈ సేవలు పొందినట్లు గణాంకాలతో సహా విశదీకరించింది. కాగా, 24 గంటలపాటు 8096958096 వాట్సాప్ నంబర్ ద్వారా సేవలు అందిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. పది కంటే ఎక్కువ శాఖలకు చెందిన 581 రకాల సేవలను ఈ వాట్సాప్ నెంబర్ ద్వారా అందుబాటులో తీసుకువచ్చింది. క్యాస్ట్, ఆదాయం, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం ఈ వాట్సాప్ నెంబర్‌ను అత్యధికంగా వినియోగించినట్లు గుర్తించింది. మీ సేవా స్టేటస్, సర్టిఫికేట్ డౌన్‌లోడ్ అన్నీ వాట్సాప్‌లోనే పొందవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. పదే పదే మీ సేవా కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా వాట్సాప్ ద్వారా ఈ సేవలు అందిస్తోందని వివరించింది. 2025 నవంబర్ 18వ తేదీన ఈ సేవలను తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించారు. డిజిటల్ అవగాహన లేని వారికీ సులభంగా ఈ సేవలు అందిస్తోంది. అలాగే ఈ వాట్సాప్ మీ సేవ ద్వారా 31 దేవాలయ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దేవుని దర్శనం, వసతితోపాటు సేవలన్నీ ఈ వాట్సాప్‌లోనే బుకింగ్ చేసుకునే అవకాశాన్ని ఈ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక రానున్న రోజుల్లో 108, 101, 102 ఎమ్జ్గ÷న్సీ సేవలను సైతం ఈ వాట్సాప్ నెంబర్‌కు అనుసంధానం చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 5వేలకు పైగా ఉన్న మీ సేవా కేంద్రాల్లో రోజుకు 80 వేల నుంచి లక్ష మంది వరకూ సేవలు పొందుతున్నారు. 2023 నవంబర్ 1 నుంచి 2026 జనవరి 31వ తేదీ వరకూ 5.98 కోట్ల లావాదేవీలు జరిగాయని తెలిపింది. వాటి విలువ రూ.3,811 కోట్లు ఉందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# అండర్ 19 ప్రపంచకప్

# ఛాంపియన్ భారత్



కుర్రాళ్లు అదరగొట్టారు. చిచ్చరపిడుగులు చిరుతపులుల్లా విజృంభించారు. ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడి అండర్ 19 ప్రపంచకప్‌లోనే అత్యధిక స్కోర్ సాధించి రికార్డులు బద్దలు కొట్టారు. వైభవ్ సూర్యవంశీ తుఫాన్ ఇన్నింగ్స్ ఆడడంతో భారత జట్టు ఆరోసారి అండర్ 19 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. ఇంగ్లాండ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన కుర్రోళ్లు మరోసారి చాంపియన్లు నిలిచారు. ఇంగ్లండ్ పై భారత్ 100 పరుగుల భారీ తేడాతో తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. అండర్-19 ప్రపంచకప్ 2026కు భారతదేశం ఆతిథ్యం ఇవ్వగా.. ఆతిథ్య జట్టు భారత్ విజయం సాధించింది. హరారే వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత జట్టు తలపడింది. టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్‌కు తొలుత దిగింది. భారత బ్యాటర్లు జూలు విదిల్చి ఆడారు. భారత యువ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఓపెనర్ ఆరోన్ జార్జ్ 9 పరుగులకే ఔటవగా మరో ఓపెనర్‌గా దిగిన వైభవ్ సూర్యవంశీ బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. కొడితే ఫోర్.. కొడితే సిక్స్ అన్నట్టు ఆడేసి 80 బంతుల్లో 175 పరుగులు మెరుపు వేగంతో చేశాడు. అత్యంత వేగంగా సెంచరీ చేసిన క్రికెటర్‌గా సూర్యవంశీ పలు రికార్డులు బద్దలు కొట్టాడు. మాత్రే 53 పరుగులు చేసి రాణించగా.. అభిజ్ఞాన్ కుందు (40), కనిష్క్ చౌహాన్ (37) పర్వాలేదనిపించారు. సూర్యవంశీని కట్టడి చేయలేకపోవడమే కాకుండా భారత జట్టు స్కోర్‌ను నియంత్రించడంలో ఇంగ్లండ్ బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారు. జేమ్స్ మింటో మూడు వికెట్లు తీయగా.. సెబాస్టియన్ మోర్గాన్, అలెక్స్ గ్రీన్ తలా రెండు వికెట్లు తీశారు. కళ్ల ముందు భారీ లక్ష్యం కనిపిస్తున్నా.. విజయం అసాధ్యమని కనిపిస్తున్నా ఇంగ్లాండ్ బ్యాటర్లు కష్టపడ్డారు. ట్రోఫీ ఆశలు గల్లంతయినా కూడా పరువు కోసం బ్యాటర్లు పోరాడారు. ఎంత పోరాడినా కూడా వారి పోరాటం ఓటమి అంతరం తగ్గించడానికి తప్ప ఇంకేది కాదని వారికి కూడా తెలుసు. చివరకు అతి కష్టంగా 290 వరకు చేసి ఆలౌటైంది. భారీ లక్ష్యాన్ని చేధించడానికి ఓపెనర్లుగా జోసెఫ్ మోరిస్ దిగి 17 పరుగులకు ఔటవగా.. బెన్ డాకిన్స్ మాత్రం 66 పరుగులతో గొప్పగా ఆరంభించాడు. బెన్ మేస్ 45 స్కోర్‌తో రాణించగా.. కెప్టెన్ థామస్ రే 31 పరుగులతో పర్వాలేదనిపించాడు. అనంతరం వచ్చిన కాలెబ్ మాథ్యూ ఫాల్కనర్ జట్టు విజయం కోసం తీవ్రంగా శ్రమించాడు. 67 బంతుల్లో 115 పరుగులతో సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. సూర్యవంశీ స్ఫూర్తితో బ్యాట్‌తో దుమ్మురేపాడు. రాల్ఫీ ఆల్బర్ట్ డకౌట్ కాగా.. ఫర్హాన్ అహ్మద్ ఒక్క పరుగుతో వెనుదిరిగాడు. ఆఖరులో జేమ్స్ మింటో విలువైన 28 పరుగులు జోడించాడు. బ్యాటర్లు భారీ స్కోర్ చేసినా దానికి కాపాడడంలో భారత బౌలర్లు తడబడ్డారు. రికార్డు స్కోర్‌ను రికార్డు తేడాతో ఓడించాలని లక్ష్యం విధించుకోగా బౌలర్ల వైఫల్యంతో ప్రత్యర్థి జట్టు గొప్పగా ఆడింది. పకడ్బందీగా బౌలింగ్ వేసినా కూడా వికెట్లు లక్ష్యంగా బౌలర్లు వేయకపోవడంతో భారీ విజయం లభించలేదు. అంబ్రిష్, దీపేశ్ దేవేంద్రన్ రెండేసి వికెట్లు తీయగా.. ఖిలాన్ పటేల్, కనిష్క్ చౌహన్, ఆయుష్ మాత్రే ఒక్కో వికెట్ తీశారు.హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో వైభవ్ సిక్సర్ల వర్షం కురిపించడంతో స్టేడియం చిన్నబోయింది. 14 ఏళ్ల సూర్యవంశీ బ్యాటింగ్ చూసి ప్రత్యర్థి బౌలర్లు గజగజ వణికిపోయారు. 15 ఫోర్లు, 15 సిక్సర్లతో దంచుతుండడంతో అందరూ డబుల్ సెంచరీ చేస్తాడని భావించారు. అయితే ఒక షాట్ ఆడబోయి ప్రత్యర్థి ఫీల్డర్లకు బంతి చిక్కడంతో సూర్యవంశీ ఔటయ్యాడు. ఆ క్యాచ్ మిస్సయ్యింటే మాత్రం అండర్ 19 ప్రపంచకప్‌లోనే సూర్యవంశీ తన పేరును సువర్ణ అక్షరాలతో లిఖించుకునేవాడు. అండర్-19 ప్రపంచకప్ ఫైనల్ చరిత్రలోనే భారత జట్టు అరుదైన రికార్డును నమోదు చేసింది. అండర్ 19 ప్రపంచకప్‌లో అత్యధిక స్కోర్ సాధించిన జట్టుగా టీమిండియా నిలిచింది. గతంలో ఉన్న ఆస్ట్రేలియాను భారత్ పక్కకు నెట్టేసింది. అండర్-19 ప్రపంచకప్ 2024 ఫైనల్లో భారత్‌పై ఆస్ట్రేలియా 253 పరుగులు చేయగా.. 2026కు వచ్చేసరికి భారత జట్టు 411 పరుగులు చేసి ఆల్‌టైమ్ రికార్డును సాధించింది. ఇక అండర్19 ప్రపంచకప్‌లో 400 పరుగుల మార్కును అత్యధిక సార్లు చేసిన జట్టుగా కూడా భారత్ రికార్డులకెక్కింది. ఇప్పటివరకు ఈ ప్రపంచకప్‌లో భారత యువ జట్టు మూడు సార్లు 400కు పైగా స్కోరును నమోదుచేసింది.

**ఫైనల్లో భారత్ చేతిలో ఇంగ్లండ్ చిత్తు!**

**100 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా**

**411 పరుగులతో భారత జట్టు ఆల్‌టైమ్ రికార్డు**




## టీమిండియాకు బిగ్ షాక్

### హర్షిత్ రాణా గాయంతో జట్టుకు దూరం

### రాణా స్థానంలో సిరాజ్‌ను ఎంపిక?

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభానికి ముందే టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. యువ పేసర్ హర్షిత్ రాణా గాయంతో జట్టుకు దూరమైనట్లు తెలుస్తోంది. సౌతాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లో హర్షిత్ రాణా మోకాలి నొప్పితో ఇబ్బంది పడ్డాడు. ఆ మ్యాచ్‌లో ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేసిన హర్షిత్ రాణా 16 పరుగులు ఇచ్చాడు. ఆ సమయంలోనూ రెండు సార్లు తన రనప్‌ను ఆపాడు.తన కుడి మోకాలిని పట్టుకుని తీవ్రమైన నొప్పితో మైదానాన్ని వీడాడు. ఆ తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టలేదు. అయితే హర్షిత్ రాణా కుడి మోకాలి జాయింట్‌లో సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. స్కాన్లలోనూ ఆ విషయం వెల్లడైనట్లు జాతీయ మీడియా పేర్కొంది. వైద్యుల సూచన మేరకు హర్షిత్ రాణా మెటా టోర్నీ నుంచి తప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే హర్షిత్ రాణా గాయంపై బీసీసీఐ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.మెగా టోర్నీకి ముందు మీడియా సమావేశంలో పాల్గొన్న సూర్యకుమార్ యాదవ్‌ను హర్షిత్ రాణా గాయం గురించి ప్రశ్నించగా.. అవునని బదులిచ్చాడు. 'హర్షిత్ రాణా గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ విషయం మాకు ఈ రోజే తెలిసింది. ఒకవేళ హర్షిత్ రాణా జట్టుకు దూరమైతే.. అది మాకు పెద్ద నష్టం. మేం వేరే కాంబినేషన్లను ప్రయత్నిస్తాం. అయితే మా రిజర్వ్ బెంచ్ బలంగా ఉంది.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.హర్షిత్ రాణా స్థానంలో మహమ్మద్ సిరాజ్‌ను భారత సెలెక్టర్లు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. గత టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన జట్టులో సభ్యుడైన సిరాజ్, హర్షిత్ స్థానంలో జట్టుతో చేరడానికి ఇప్పటికే ముంబై చేరుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. హర్షిత్ రాణా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ కూడా చేయగలడు. ఇదే విషయాన్ని కెప్టెన్ సూర్య ముందు ప్రస్తావించగా.. జట్టులో ఇప్పటికే నాణ్యమైన బ్యాటర్లు ఉన్నారని, బౌలింగ్ విభాగంలో పటిష్టత కోసం ఉత్తమమైన బౌలర్‌ను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆ క్రమంలో సిరాజ్‌కు అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. అయితే మహమ్మద్ షమీని ఎంపిక చేసినట్లు కూడా సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. మరికొద్ది గంటల్లోనే హర్షిత్ రాణా గాయంపై అధికారిక ప్రకటన రావచ్చు. అప్పుడే అతని స్థానంలో ఎంపికైన బౌలర్ ఎవరా? అనేది తెలియనుంది.

## ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు

### టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అమెరికాతో జరిగే తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం ఇషాన్ కిషన్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడని తెలిపాడు. న్యూజిలాండ్, సౌతాఫ్రికాతోనే కాకుండా దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ ఇషాన్ కిషన్ సత్తా చాటాడని సూర్యకుమార్ యాదవ్ గుర్తు చేశాడు.న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబర్చిన సంగతి తెలిసిందే. తిలక్ వర్మ గైర్హాజరీలో తుది జట్టులో అవకాశం అందుకున్న ఇషాన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. న్యూజిలాండ్‌తో ఆఖరి టీ20లో శతకం బాదిన ఇషాన్ కిషన్.. సౌతాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లోనూ హాఫ్ సెంచరీతో రాణించి నిలకడను చాటుకున్నాడు. మరోవైపు న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో దారుణంగా విఫలమైన సంజూ శాంసన్ తుది జట్టులో చోటు కోల్పోయాడు.తిలక్ వర్మ రీఎంట్రీ ఇవ్వడంతో సౌతాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లో టీమిండియా మేనేజ్‌మెంట్ ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా ఆడించింది. మూడో స్థానంలో ఆడిన తిలక్ వర్మ కూడా మెరుగైన ప్రదర్శన చేశాడు. దాంతో సంజూ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికాతో మ్యాచ్ నేపథ్యంలో గురువారం మీడియాతో మాట్లాడిన సూర్యకుమార్ యాదవ్‌ను ఓపెనింగ్ స్లాట్ గురించి ప్రశ్నించగా.. ఇషాన్ కిషన్ బరిలోకి దిగుతాడని చెప్పాడు. అతని దూకుడైన బ్యాటింగ్‌తో జట్టుకు ఎంతో ప్రయోజకరమవుతుందని అభిప్రాయపడ్డాడు.'గత కొన్ని మ్యాచ్‌ల్లో ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. దేశవాళీ క్రికెట్‌లోనూ సత్తా చాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ దూకుడుగా ఆడి తన జట్టును విజేతగా నిలబెట్టాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఇషాన్ కిషన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. వార్మప్ మ్యాచ్‌లో మాత్రం ఓపెనర్‌గా వచ్చాడు. అతను ఏ స్థానంలో బ్యాటింగ్ చేసినా అదే దూకుడు కొనసాగించాలని కోరుకుంటున్నాను. అయితే ఫస్ట్ డౌన్ కంటే దిగువ స్థానంలోఅయితే బ్యాటింగ్ చేయడు. ఏ స్థానంలో ఆడించినా.. తన జోరు కొనసాగిస్తాడని ఆశిస్తున్నా.'అని సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో ముగిసిన టీ20 సిరీస్‌లో సంజూ శాంసన్ దారుణంగా విఫలమయ్యాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 46 పరుగులే చేశాడు. అత్యధిక స్కోరు 24 మాత్రమే. 2025 నుంచి టీ20ల్లో ఓపెనర్‌గా అతను 11 ఇన్నింగ్స్‌లలో 12.18 సగటుతో కేవలం 134 పరుగులు మాత్రమే సాధించాడు, అత్యధిక స్కోరు 37. మరోవైపు ఇషాన్ కిషన్.. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 53.75 సగటు, 231.18 స్ట్రైక్‌రేట్‌తో 215 పరుగులు చేశాడు.రెండో టీ20లో 32 బంతుల్లో 76 పరుగులతో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేయగా.. ఆఖరి టీ20లో 43 బంతుల్లో 103 పరుగులతో చెలరేగాడు. సౌతాఫ్రికాతోనూ వామప్ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో సత్తా చాటి రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తిలక్ వర్మ కూడా సత్తా చాటడంతో సంజూ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## విన్నర్‌కు కోట్ల జాక్‌పాట్



ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 కు బీసీసీఐ భారీగానే నజరానా అందించనుంది. మొత్తంగా రూ.10 కోట్లు కేటాయించింది. విభాగాల వారీగా ఈ డబ్బును కేటాయించారు. ప్రధానంగా ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో గెలిచిన జట్టు అత్యధిక వాటా పొందుతుంది. అయితే ఫైనల్ లో ఆర్సీబీ గెలిచి చరిత్ర కూడా సృష్టించింది. టోర్నీ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన జట్టుగా నిలిచింది. ఇక నాలుగు సీజన్లలోనూ టేబుల్ టాపర్ గా ఉన్న జట్టు ట్రోఫీ గెలవడం ఇదే తొలిసారి. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 ఫైనల్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు భారీగా రూ. 6 కోట్లు గెలుచుకుంది. ఢిల్లీ క్యాపిటల్ మూడు కోట్లు అందుకుంటుంది. అంతే కాదు వ్యక్తిగత ప్రశంసలు, ఆర్థిక బహుమతులు కూడా అందుకుంటారు. ఇక ఈ మ్యాచ్ లో స్మృతి (87) జార్జియా హోల్ (79) తో అదరగొట్టారు. ఇప్పటివరకు ఢిల్లీ ప్రతిసారి ఫైనల్ కు వచ్చి ఓడిపోతూ వస్తోంది. రెండోసారి కప్పును ఆర్సీబీ కైవసం చేసుకుంది. 2023, 2025లో ముంబై.. 2024, 2026లో ఆర్సీబీ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ విజేతలుగా నిలిచాయి. అయితే ఢిల్లీ మాత్రం నాలుగు సార్లు ఫైనల్ చేరింది కానీ.. టైటిల్ మాత్రం సొంతం చేసుకోలేక పోయింది. ఒక ఉమెన్స్ ప్రీమియర్ లీ 2026లో విజేతగా నిలిచిన ఆర్సీబీకి అభినందనలు కూడా వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా ఆర్సీబీ ఫ్యాన్స్ పండగు చేసుకుంటున్నారు. స్మృతి అందరిని గర్వపడేలా చేసిందని క్రికెటర్ కోహ్లీ కూడా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభినందనలు తెలిపారు. టోర్నమెంట్లో అందరూ ఉత్తమ ప్రదర్శనతో అద్భుత విజయం సాధించారని అంటూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కూడా వారికి కంగ్రాట్స్ చెప్పారు. ఈసారి కూడా కప్పు మనదే అంటూ డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కొన్ని రోజుల క్రితమే ప్రియుడితో అనూహ్య పరిస్థితిలో పెళ్లి రద్దయిన స్మృతి మందన్నా ఏమాత్రం తగ్గలేదు.. అందుకే విజయం కూడా వరించక తప్పలేదు. పలు రకాలుగా ఆమెపై సోషల్ మీడియాలో ప్రచారం జరిగినా.. కానీ పట్టించుకోకుండా కొన్ని రోజులకే ఆమె మళ్ళీ బ్యాట్ పట్టారు. శ్రీలంక సిరీస్‌లో పర్వాలేదు అనిపించినా.. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 లో ఆర్సీబీ సారథిగా మరోసారి సత్తా చాటారు. సీజన్లో అత్యధిక పరుగులు చేయడమే కాకుండా ఫైనల్ లో అసలైన ఛాంపియన్‌గా స్మృతి నిరూపించారు.

## హీట్ పుట్టిస్తున్న డింపుల్ హాయతి

టాలీవుడ్‌లో గ్లామర్ తో పాటూ పర్ఫార్మెన్స్‌తో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి డింపుల్ హాయతి. 'కిలాడీ', 'రామబాణం' వంటి చిత్రాలతో కుర్రకారు గుండెల్లో సెగలు రేపిన ఈ భామ, సోషల్ మీడియాలో కూడా అదే స్థాయిలో హీట్ పెంచుతోంది. తాజాగా ఆమె షేర్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తన కిల్లింగ్ లుక్స్‌తో, అదిరిపోయే ఫిజిక్‌తో నెటిజన్లను కట్టిపడేస్తున్న ఈ సొగసరి ఫోటోషూట్ విశేషాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. డింపుల్ హాయతికి ఫ్యాషన్ సెన్స్ , గ్లామర్‌ను ఎలా పండించాలో బాగా తెలుసు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలలో బ్లాక్ కలర్ స్టైలిష్ డ్రెస్ ధరించి మెరిసిపోతోంది. ఆమె చూపులు, ఆ పోజులు చూస్తుంటే కుర్రాళ్లకు నిద్ర కరువవ్వడం ఖాయం. 'గద్దలకొండ గణేష్'లో 'జర్రా జర్రా' అంటూ తన డాన్స్ స్టెప్పులతో థియేటర్లను ఊపేసిన ఈ బ్యూటీ, ఇప్పుడు తన గ్లామర్ ఫోటోలతో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను షేక్ చేస్తోంది. తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టే డింపుల్, ఈ ఫోటోలలో తన పర్ఫెక్ట్ కర్వ్‌లను ప్రదర్శిస్తూ నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనలోనూ తనదైన ముద్ర వేయాలని తపిస్తోంది ఈ భామ. రవితేజ సరసన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాలో అదిరిపోయే గ్లామర్ రోల్ పోషించి టాలీవుడ్‌లో ఒక్కసారిగా లైమ్ లైట్లోకి వచ్చింది. ఆ తర్వాత గోపీచంద్ సరసన 'రామబాణం'లో పద్ధతిగా ఉంటూనే తన నటనతో మెప్పించింది. ఒకవైపు కమర్షియల్ మాస్ సాంగ్స్ చేస్తూనే, మరోవైపు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్ గ్రాఫ్‌ను పెంచుకుంటోంది. ఈ తాజా ఫోటోషూట్ చూస్తుంటే, త్వరలోనే డింపుల్ మరిన్ని పెద్ద ప్రాజెక్టులను దక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. డింపుల్ హాయతి షేర్ చేసిన ఈ ఫోటోలపై నెటిజన్లు రకరకాల కామెంట్లతో ముంచెత్తుతున్నారు. బ్యూటీ, అగ్గి పుట్టిస్తున్నావు, టాలీవుడ్ సెన్సేషన్ అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన అప్‌డేట్స్‌తో అభిమానులను అలరించే ఈ భామ, రాబోయే రోజుల్లో మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో మన ముందుకు రానుంది. గ్లామర్ ప్లస్ టాలెంట్ ఉన్న ఈ సుందరి, స్టార్ హీరోయిన్ రేసులో దూసుకుపోవడం ఖాయం.




## 11న ఓటిటిలోకి అనగనగా ఒక రాజు



ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో విడుదలైన సినిమాల్లో 'అనగనగా ఒక రాజు' ఒకటి. ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారైంది. ఈనెల 11 నుంచి 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ కానుంది. గోదావరి నేపథ్యంతో కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన 'అనగనగా ఒక రాజు' పండగ సినిమా అనిపించుకుంది. తన కామెడీ టైమింగ్ ఎలాంటిదో హీరో నవీన్ పొలిశెట్టి ఈ చిత్రంతో మరోసారి నిరూపించారు. ఆయనకు జోడీగా నటించిన మీనాక్షీ చౌదరి అందం, అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ మూవీలో చమ్మక్ చంద్ర, 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ బుల్లిరాజు, రావు రమేశ్ తదితరులు సందడి చేశారు. దర్శకుడు మారి తెరకెక్కించిన ఈ సినిమా జనవరి 14న విడుదలైన సంగతి తెలిసిందే. రూ.100? కోట్లు కలెక్ట్ చేసిన సందర్భంగా.. హీరో నవీన్‌కు ప్రొడ్యూసర్ నవీన్ ఎర్నేని తాజాగా కంగ్రాట్స్ చెప్పారు. తమ కాంబినేషన్‌లో మరో మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని తెలిపారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడు రాజు (నవీన్ పొలిశెట్టి). జమీందార్ మనవడు అనే పేరు తప్ప ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ కాలం గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి, చారులత మనసుని ఎలా గెలిచాడు? ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగుపెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అన్నదే మిగతా కథ.

## సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో రాకాస

టాలీవుడ్ యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'రాకాస' ఇప్పుడు సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'మ్యాడ్' సినిమాతో యువ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించిన సంగీత్ శోభన్ ఈసారి ఫాంటసీ,హారర్ జానర్‌లో కొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రంలో 'ఆయ్' మూవీ ఫేమ్ నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తుండగా, దర్శకురాలు మానస శర్మ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతంలో నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో, ఆమె నిర్మాణంలో వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్‌పై కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. యువతరానికి దగ్గరగా ఉండే కథలు, కొత్త కాన్సెప్ట్‌కి ప్రాధాన్యం ఇస్తూ నిహారిక నిర్మాణంలో వస్తున్న ప్రతి చిత్రం ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటోంది. ఇటీవల విడుదలైన 'రాకాస' టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఫాంటసీ ఎలిమెంట్స్, హారర్ బ్యాక్‌డ్రాప్, కామెడీ టచ్ అన్నీ కలగలిపి వినోదభరితంగా టీజర్ ఉండటంతో సినిమాపై బజ్ ఒక్కసారిగా పెరిగింది. సోషల్ మీడియాలో కూడా ఈ టీజర్‌కు మంచి స్పందన లభించింది. అప్పటి నుంచి సినిమా రిలీజ్ ఎప్పుడన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'రాకాస' చిత్రాన్ని 2026 ఏప్రిల్ 3న సమ్మర్ కానుకగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు స్పెషల్ పోస్టర్ ద్వారా వెల్లడించారు. సమ్మర్ హాలిడే సీజన్‌ను టా÷-గ్గ్÷ట్ చేస్తూ వస్తున్న ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యువతను కూడా ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఫాంటసీ, హారర్, హిలేరియస్ కామెడీ అంశాలతో ఫుల్ ఆన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం సంగీత్ శోభన్ కెరీర్‌లో మరో ప్రత్యేక మైలురాయిగా నిలుస్తుందా అనే ఆసక్తి నెలకొంది. విభిన్న జానర్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితం సాధిస్తుందో తెలుసుకోవాలంటే ఏప్రిల్ వరకు వేచి చూడాల్సిందే.



## అర్జున్ కూతురు హీరోయిన్‌గా సీతాపయనం

**ఈనెల 14న గ్రాండ్‌గా విడుదలకు సన్నాహాలు**



యాక్షన్ కింగ్ అర్జున్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన విభిన్న కథా చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ద్వారా అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ వెండితెరకు కథానాయికగా పరిచయం అవుతుండటం విశేషం. నిరంజన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషించగా, అర్జున్ స్వయంగా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనున్నారు. అలాగే ఆయన మేనల్లుడు, యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా కూడా ఈ మూవీలో స్పెషల్ కామియో రోల్‌లో కనిపించబోతున్నారు. ఈ సినిమాను ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ప్రస్తుతం అన్ని రకాల పోస్ట్ ప్రొడక్షన్ పనులతో పాటు సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఇప్పటికే పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన పాటలు, ఇతర కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే హృద్యమైన అంశాలతో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని అర్జున్ అద్భుతంగా తీర్చిదిద్దారు. తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందింది. జి. బాలమురుగన్ సినిమాటోగ్రఫీ అందించగా, ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా పదునైన డైలాగ్స్ రాశారు. యాక్షన్ కింగ్ సినిమా అంటేన్గే ÷ట్స్ స్పెషల్‌గా ఉంటాయి కాబట్టి, ఈ చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రేక్షకుల్లోకి వెళ్తున్న మేకర్స్, త్వరలోనే సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 14న ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న 'సీతా పయనం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.

## మాదక ద్రవ్యాల ప్రభావంతో.. అల్లుకున్న యుఫోరియా



ఎన్నో విజయవంతమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ గుణశేఖర్... కానీ, కొన్నేళ్లుగా ఆయన సినిమాలేవీ ఆశించిన స్థాయిలో అలరించలేకపోయాయి. ఈ నేపథ్యంలోనే ఈసారి విజయమే లక్ష్యంగా యువతరాన్ని దృష్టిలో పెట్టుకుని తీసిన చిత్రం 'యుఫోరియా' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. చైత్ర (సారా అర్జున్) ఓ పెద్దింటి అమ్మాయి. చదువులో టాపర్. ఐఏఎస్ అవ్వాలన్నది తన లక్ష్యం. దాని కోసమే పట్టుదలగా పరీక్షలకు సిద్ధమవుతుంటుంది. ఓరోజు తన మిత్రురాలు ఓ పబ్ పార్టీకి పిలవడంతో అమ్మానాన్న అనుమతితో ఆ పార్టీకి వెళ్తుంది. అక్కడే వికాశ్ (విఘ్నేశ్ గవిరెడ్డి)తో పాటు అతని మిత్ర బృందం పరిచయమవుతుంది. చైత్ర అందచందాలు చూసి ఆకర్షితుడైన వికాశ్.. ఆమెపై కన్నేస్తాడు. తను తిరిగి వెళ్తున్న సమయంలో కారులో సరదాగా బయటకు వెళ్దామని ఆఫర్ చేస్తాడు. అయితే వికాశ్‌పై స్నేహభావంతో అతని కారెక్కిన చైత్రకు చేదు అనుభవం ఎదురవుతుంది. డ్రగ్స్ మత్తులో ఉన్న వికాశ్‌తో పాటు అతని మరో నలుగురు మిత్రులు ఆమెపై దారుణ రీతిలో అత్యాచారానికి పాల్పడతారు. మరి ఆ తర్వాత ఏమైంది? రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ రేప్ కేసును సిటీ కమిషనర్ జయదేవ్ (గౌతమ్ మేనన్) ఎలా ఛేదించారు? పేరు మోసిన రాజకీయ నేతలు, వ్యాపారవేత్తల పిల్లలు నిందితులుగా ఉన్న ఈ కేసును పరిష్కరించే క్రమంలో ఎదురైన సవాళ్లేంటి? ఈ కథ లో వింధ్య వేములపల్లి (భూమిక) పాత్రకి ఉన్న ప్రాధాన్యత ఏంటి? ఆమె 'నేను నేరం చేశాను.. శిక్ష విధించండి' అంటూ' హైకోర్టు మెట్లు ఎక్కడానికి వెనకున్న కారణమేంటి? కమిషనర్ జయదేవ్ ప్రారంభించిన 'ఆపరేషన్ యుఫోరియా' లక్ష్యం ఏంటి? అన్నది మిగిలిన కథ. యువతరం మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఏమవుతుంది.. ఆ మత్తులో విచక్షణ కోల్పోయి చేసే తప్పులకు పిల్లల జీవితాలతో పాటు కన్నవాళ్ల జీవితాలు ఎలా తలకిందుల య్యాయి? అనేది ఈ చిత్ర సారాంశం. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన జూబ్లీహిల్స్ పబ్ అత్యాచార ఘటనతో పాటు మరికొన్ని కీలక సంఘటనల్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ కథను అల్లుకున్నట్లు అర్థమవుతోంది. నిజానికి ఈ చిత్ర ట్రైలర్‌తోనే సినిమా కథేంటి? అదెలా సాగనుందన్నది ముందే క్లారిటీగా చెప్పేశారు దర్శకుడు గుణశేఖర్. కాకపోతే దీన్ని ఆయన తెరపై ఏ కోణంలో ఆవిష్కరించారు? దీనిపై ఎంత లోతుగా చర్చించారన్నది అందరిలోనూ ఆసక్తిరేకెత్తించింది. అత్యాచార ఘటనకు సంబంధించిన వార్తల్ని అన్నింటిని ఓ దగ్గర పోగేసి తీసిన సినిమా ఇది. దీంతో ఆసక్తికర డ్రామాగా సాగాల్సిన మూవీ ఒక డాక్యుమెంటరీలా అనిపిస్తుంది. చైత్ర అత్యాచార ఘటన కేసు ఇన్వెస్టిగేషన్ మొదలయ్యాకే కథలో కాస్త సంఘర్షణ కనిపిస్తుంది. ఈ కేసులోని నిందితులతో కమిషనర్ జయదేవ్ వ్యవహరించే తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఇలాంటి అత్యాచార కేసుల్లో సాక్ష్యాల సేకరణ ఎలా ఉంటుందన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ క్రమంలో వచ్చే కొన్ని సన్నివేశాలు సున్నిత మనస్కులకు ఇబ్బందికరంగా అనిపించొచ్చు. అత్యాచార కేసులో జీవిత ఖైదు పడిన వికాశ్ గ్యాంగ్‌కు జైల్లో ఎదురైన అనుభవాలేంటి? కొడుకు చేసిన తప్పునకు ఓ తల్లిగా భూమిక సమాజం నుంచి ఎలాంటి అవమానాల్ని ఎదుర్కొంది? ఆమె తనపై తాను కేసు వేసుకుని కోర్టు మెట్లు ఎక్కడానికి కారణమేంటి? సమాజంలోని మాదక ద్రవ్యాల ముఠాల్ని ఏరిపారేసేందుకు కమిషనర్ జయదేవ్ చేపట్టిన ఆపరేషన్ యుఫోరియా ఏమైంది? అన్నది ద్వితీయార్థానికి కీలకాంశాలు. ఆసక్తికరంగా సాగాల్సిన సెకండాఫ్ ఇన్ని పాయింట్ల మధ్య గాడి తప్పిన అనుభూతి కలుగుతుంది. తప్పు చేసిన కొడుక్కి సెకండ్ ఛాన్స్ ఇచ్చి.. అతన్ని మళ్లీ దారిలో పెట్టాలనుకునే తల్లి ఆలోచన మెచ్చుకోదగ్గదే అయినప్పటికీ ఆ ప్రయాణాన్ని కన్విన్సింగ్‌గా చూపించలేకపోయారు. పతాక ఘట్టాలు అందర్నీ ఆలోచింపజేసేలా.. మనసుల్ని కదిలించేలా ఉంటాయి.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com